శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు
వార్త



## అకౌంట్స్ విభాగంతో సమీక్ష నిర్వహించిన మేయర్ స్రవంతిజయవర్ధన్



**నెల్లూరు కార్పొరేషన్, డిసెంబర్ 20, ప్రభాతవార్త :** నెల్లూరు నగరపాలక సంస్థ కార్యాలయం మేయర్ ఛాంబర్ నందు కార్పొరేషన్ కు సంబంధించిన అకౌంట్స్ విభాగం అధికారులుతో మేయర్ స్రవంతిజయవర్ధన్ సమీక్ష సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈసందర్భంగా మేయర్ అధికారులకు పలు సూచనలు, సలహాలు చేశారు. ఈ సమీక్ష సమావేశంలో అకౌంట్స్ సుపరిండెంట్ పద్మజా, విశ్వరత్నం తదితరులు పాల్గొన్నారు.

## సోమశిల నీటిమట్టం



**అనంతసాగరం, డిసెంబం20, ప్రభాతవార్త :** మండలంలోని సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి శుక్రవారం సాయంత్రానికి 2750 క్యూసెక్కుల వంతున వరద ప్రవాహం నమోదైంది. జలాశయం పూర్తిసామర్థ్యం 78 టిఎంసిలు కాగా ప్రస్తుతం జలాశయం లో 72.537టిఎంసిల నీరు నిల్వ ఉంది. ఎస్ఎఫ్‌సికి 350, ఎన్ఎఫ్‌సికి600, పెన్నా డెల్టాకు 1550, కండలేరు వరద కాలువకు1200 క్యూసెక్కులు వంతున నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం 99.834మీటర్ల మేర నీటిమట్టం నమోదైందని జలాశయం అధికారులు తెలిపారు.

## నేడే జడ్పీలో జిల్లా అభివృద్ధి సమన్వయ కమిటీ సమావేశం



**నెల్లూరు అర్బన్, డిసెంబర్ 20, ప్రభాతవార్త** నెల్లూరు జిల్లా నూతన జిల్లా పరిషత్ కార్యాలయంలోని వేశ మందిరంలో నెల్లూరు జిల్లా అభివృద్ధి, సమన్వయ, పర్యవేక్షణ కమిటీ, సమావేశం శనివారం ఉదయం 10 గంటలకు జడ్పీలో జరుగుతుం దని సీఈవో విద్యా రమ ఓ ప్రకటనలో తెలిపారు. నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకం దిన దయాల్ అంతోధ్యాయ యోజన జాతీయ గ్రామీణ జీవనోపాధి మిషన్ దీన దయాల్ ఉపాధ్యాయ గ్రామీణ కౌసల్య యోజన ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన జాతీయ సామాజిక సహాయ పథకం ప్రధానమంత్రి ఆవాస్ యోజన స్వచ్ఛ భారత్ మిషన్ జల్ జీవన్ మెషిన్ తదితర కేంద్ర ప్రభుత్వానికి చెందిన 42, అంశాలపై సమీక్ష నిర్వహించడం జరుగుతుందని ,ఆయా పథకాలలో జిల్లాలో ,అమలు జరుగుతున్న తీరుపై సమీక్షిస్తానన్నారు ఈ సమావేశానికి జడ్పీ సీఈవో సంబంధిత జిల్లా అధికారులు తప్పక హాజరు తప్పక హాజరు కావాలని జెడ్పి సీఈవో విద్యారమ తెలిపారు.

## అభివృద్ధి పనులను పరిశీలించిన ఎమ్మెల్యే



**కావలి, డిసెంబర్20 ప్రభాతవార్త** కావలి అభివృద్ధిపనులను ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి శుక్రవారం పరిశీలించారు. ముసునూరు గురురాఘవేంద్రకాలనీలో శరవేగంగా జరుగుతున్న రైల్వేఅండర్‌పాస్, అండర్‌గ్రౌండ్ డ్రేనేజ్, సైడ్‌డ్రేనేజ్, రోడ్డు విస్తరణ పనులను ఆయన అధికారులతో, టిడిపినేతలతో పరిశీలించారు. ఇందిరమ్మకాలనీ, బాలకృష్ణారెడ్డినగర్, వెంగళరావునగర్, చంద్రబాబునగర్ ప్రజల రవాణాసౌకర్యాన్ని మెరుగుపర్చే బృహత్తరమైనది రైల్వేఅండర్‌పాస్ అని ఎమ్మెల్యే దగుమాటి తెలిపారు. కావలి నియోజకవర్గ అభివృద్ధికోసం నిరంతరం పాటుపడుతున్నామని ఆయన తెలిపారు.

## టిడిపి శాశ్వత సభ్యత్వం తీసుకున్న పోలంరెడ్డి



**కోవూరు డిసెంబర్ 20 ప్రభాతవార్త** తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు ముఖ్యమంత్రి నారాచంద్ర బాబునాయుడు పిలుపు మేరకు, తెలుగుదేశం పార్టీలో క్రియాశీలకంగా పనిచేస్తున్న తెలుగుదేశం పార్టీ జాతీయ అధికార ప్రతినిధి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్విరాన్మెంట్ మేనేజ్మెంట్ కార్పోరేషన్ చైర్మన్ పోలంరెడ్డి దినేష్‌రెడ్డి ఆయన తండ్రి మాజీ ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి శుక్రవారం తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యాలయంలో రెండు లక్షలు చెల్లించి ఇరువురు పార్టీ శాశ్వత సభ్యత్వం తీసుకున్నారు. ఈ సందర్భంగా దినేష్‌రెడ్డి మాట్లాడుతు తెలుగుదేశం పార్టీ మాత్రమే రాష్ట్రాన్ని అభివృద్ధి చేయగలుగుతుందని సామాజిక న్యాయం పాటిస్తు కార్యకర్తల సంక్షేమం కోసం పాటుపడే బాధ్యత విద్య ఐటి శాఖ మంత్రి నారా లోకేష్ బాబు తీసుకున్నారన్నారు.

## కలెక్టరేట్‌లో ఎస్సీ ఎస్టీలకు ఉచితంగా ఆధార్ సేవలు



**నెల్లూరు అర్బన్, డిసెంబర్ 20, ప్రభాతవార్త** జిల్లా ఐటీడీఏ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కలెక్టర్ కార్యాలయంలో ఉన్న ఆధార్ నమోదు కేంద్రంలో శుక్రవారం ఉచితంగా ఎస్సీ ఎస్టీలకు ఆధార్, తీయడం జరిగింది. సైదాపురం, మండలం చగనం రాజుపాలెం గ్రామంకి చెందిన ఈగ శివమణికి ఆధార్ కార్డు లేక ప్రభుత్వ పథకాలు నోచుకోని శివమణికి నూతనంగా ఆధార్ కార్డు తీయడం జరిగింది జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఉన్న ఆధార్ కేంద్రానికి ఎస్సీ ఎస్టీలు వచ్చి ఆధార్ ని తీపించుకోవాల్సిందిగా కలెక్టర్ కార్యాలయంలో ఉన్న ఆధార్ సెంటర్ ఆపరేటర్ సల్మాన్ తెలిపారు ఈ సద్వినియోగాన్ని జిల్లాలోని ఎస్సీ ఎస్టీలు ఉపయోగించుకోవాలని సల్మాన్ తెలిపారు.

# జీజీహెచ్ సెల్లార్లో అసాంఘిక కార్యకలాపాలు..?

### సీసీ కెమెరాలు కిందకు వంచేసి..
### కొన్నింటిని కత్తిరించి
### చీకటి కార్యకలాపాలకు పాల్పడుతున్న ఉద్యోగులు
### పట్టించుకోని అధికారులు



**నెల్లూరు, డిసెంబర్ 20, ప్రభాతవార్త-వైద్యం** నెల్లూరు జిల్లాలోనే పేరు మోసిన నగరంలోని దర్గామిట్టలో ఉన్న ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి(పెద్దాసుపత్రి) నూతన ఐపీ భవనంలోని విశాలమైన సెల్లార్‌లో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయనే ప్రచారం ఊపందుకుంది. ఈ విషయం ఆసుపత్రిలోని ఉద్యోగుల్లో పెద్ద చర్చ నీయాంశంగా మారింది. సుమారు 2 ఎకరాలకు పైగా ఉన్న ఆ నూతన భవనం సెల్లార్‌లో గతంలో కూడా అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయనే వార్తలు గుప్పుమనడంతో సెల్లార్లో ఉన్న శానిటరీ విభాగానికి చెందిన ఏసీతో కూడిన ప్రత్యేక గదిని అధికారులు ఖాళీ చేయించేశారు. అనంతరం అవిశాలమైన సెల్లార్లో 10 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. సీసీ కెమెరాలను గ్రౌండ్ ఫ్లోర్లో ఉన్న కెమెరాల మానిటరింగ్ గదికి అనుసంధానం చేశారు.

**పని చేయని సీసీ కెమెరాలు :** ఈ చిత్రంలోని ఫొటోను చూడండి. సెల్లార్లో ఉన్న సీసీ కెమెరాల భాగున్నప్పటికి అందుకు సంబంధించిన వైరుని కత్తిరించి అది పని చేయకుండా చేశారు. కొందరు ఉద్యోగులు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని అనుకుంటున్నారు. అలాగే గ్రౌండ్ ఫ్లోర్ నుండి సెల్లార్లకు వచ్చే చోటలోనికి ఎవరు వస్తున్నారో.. ఎవరు వెళ్తున్నారో తెలుసుకునేందుకు ఏర్పాటు చేసిన కెమెరాను చుట్టు పరిసరాలు కనిపించకుండా దానిని నేల మాత్రమే కనిపించేలా వంచేశారు. గ్రౌండ్‌ఫ్లోర్ ఐసీయు కెళ్లే లిఫ్టు ఎదురుగా ఉన్న మెట్లు నుంచి సెల్లారుకి వెళ్లేందుకు మో మార్గం ఉంది. అక్కడ కూడా సీసీ కెమెరాను కిందకు వంచేసి ఎవరు వస్తున్నారో.. ఎవరు ఏమి చేస్తున్నారో తెలియని పరిస్థితి కల్పించారు. ఎవరు ఏమి చేస్తున్నారో తెలియని పరిస్థితిని కల్పించారు. అక్కడ 10 ఎసీసీ కెమెరాలు ఉంటే వాటిలో ఆరు కెమెరాలను పని చేయకుండా చేశారు. మరో నాలుగు పని చేస్తున్నప్పటికి అవి వేరే మార్గంలో ఉన్నాయి. అవి సెల్లార్లో ఉన్న స్థలంలో 10 శాతం కూడా కవర్ చేయడం లేదు. ఇలా చేసి ఓ ముగ్గురు, నలుగురు ఇక్కడ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారనే వార్తలు గుప్పుమంటున్నాయి.

**పట్టించుకోని అధికారులు :** సీసీ కెమెరాలు పని చేయకుండా చేసినప్పటికి అదికారులు పట్టించుకోవడం లేదు. అందుకు సీసీ కెమెరాలను వంచి వేయడమే ప్రత్యక్ష సాక్ష్యం. సీసీ కెమెరాల పనితీరును మానిటరింగ్ చేసే వ్యవస్థ ఉన్నప్పటికి సెల్లార్లో అవి పని చేయకపోయినా పట్టించుకోవాల్సిన మానిటరింగ్ అధికారులు కూడా కిమ్మనకుండడం ఆలోచింపచేస్తోంది. దీంతో ఈ వ్యవహారమంతా సాయంకాలం 6 గంటల తర్వాత సాగుతోందని అక్కడి స్టాఫ్ పేర్కొంటున్నారు. సాయంకాలం 5 గంటలకు ఆసుపత్రిలోని ఉద్యోగులంతా ఇళ్లకు వెళ్లిపోతారు. అయితే పెండింగ్ వర్క్‌ను పూర్తి చేయాలనే ఉద్దేశంతో కొంత మంది ఆఫీసు సమయం అయిపోయిన తర్వాత కూడా ఉంటున్నారు. చీకటి పడ్డాక అసాంఘిక కార్యకలాపాలకు పూనుకుంటున్నారు. ఇకనైనా అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్టవేయాలని, సీసీ కెమెరాలను సక్రమంగా పని చేసేలా చూడాలని అవసరమైతే అదనంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసిభద్రత కల్పిస్తూ అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయాలని ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారు.



**పర్యవేక్షణ చేయిస్తాం :** మడపర్తి శ్రీనివాసులు, హాస్పిటల్ డవలప్‌మెంట్ కమిటీ కోఆర్డినేటర్ సెల్లార్లో సీసీ కెమెరాలు ఎందుకు పని చేయడం లేదో పరిశీలిస్తాం. విచారణ జరిపి సీసీ కెమెరాలను కిందకు వంచేసిన వారిపై చర్యలు తీసుకునేలా ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తాం. మళ్లీ వాటికి మరమ్మత్తులు చేయించి పని చేసేలా చర్యలు తీసుకుంటాం.

# కాకాణి ఆధ్వర్యంలో జిల్లా పార్టీ కార్యాలయ ప్రారంభం



**నెల్లూరు రూరల్, డిసెంబర్ 20, ప్రభాతవార్త** నెల్లూరు జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని నెల్లూరు డైకస్ రోడ్డు సెంటర్, సాయిరాం నగర్‌లో మాజీ మంత్రి, ఉమ్మడి నెల్లూరు జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కాకాణి గోవర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో పలువురు సీనియర్ నాయకుల చేతుల మీదుగా ప్రారంభించారు. అట్టహాసంగా జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుండి భారీగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, సానుభూతిపరులు తరలివచ్చారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా పరిషత్ చైర్మన్ ఆనం అరుణమ్మ, శాసనమండలి సభ్యులు పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి , మేరిగ మురళీధర్ , మాజీ మంత్రివర్యులు అనిల్ కుమార్ యాదవ్ , మాజీ శాసనసభ్యులు కిలివేటి సంజీవయ్య , రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి , వెంకటగిరి నియోజకవర్గ ఇంచార్జ్ నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి , నెల్లూరు రూరల్ నియోజకవర్గం ఇంచార్జ్ ఆనం విజయకుమార్ రెడ్డి గారు, మైనార్టీ రాష్ట్ర కార్యదర్శి మహమ్మద్ ఖలీల్ అహ్మద్ , వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎల్లసిరి గోపాల్ రెడ్డి , విజయ డైరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి , ఏపీ రాష్ట్ర డైరీ డెవలప్మెంట్ ఫెడరేషన్ మాజీ చైర్మన్ చిల్లకూరు సుధీర్ రెడ్డి , మాజీ నెల్లూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు అధ్యక్షులు కామిరెడ్డి సత్యనారాయణ రెడ్డి , జిల్లా అనుబంధ విభాగాల అధ్యక్షులు, మండల కన్వీనర్లు, మున్సిపల్ చైర్మన్లు, మండల పరిషత్ అధ్యక్షులు, జెడ్పిటిసి సభ్యులు, కార్పొరేటర్లు, కౌన్సిలర్లు తదితరులు. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా, భారీగా విచ్చేసి జయప్రదం చేసిన నాయకులకు, కార్యకర్తలకు, స్థానిక ప్రజాప్రతినిధులకు పేరుపేరున డా. కాకాణి గోవర్ధన్ రెడ్డి ధన్యవాదాలు తెలిపారు.



# 32 వేల ఎకరాలు అన్యాక్రాంతం

### ఉన్న స్థలాలకి జియోట్యాగింగ్ చేయండి
### నిజాయితీగా పని చేయండి

**నెల్లూరు, డిసెంబర్ 20, ప్రభాతవార్త-వైద్యం** రాష్ట్రంలో వక్ఫ్‌బోర్డుకి సంబంధించిన 32 వేల ఎకరాలు ఎలాఅన్యాక్రాంతం అయ్యాయో తక్షణమే తెలియజేయాలని రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్, నెల్లూరు పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు షేక్ అబ్దుల్ అజీజ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం నగరంలోని హరినాథపురంలో ఉన్న అబ్దుల్ అజీజ్ నివాసం నుంచి అజీజ్ జిల్లాల వక్ఫ్‌బోర్డు సీఈఓ, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఆడిటర్స్‌తో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో వక్ఫ్‌బోర్డు అధికారులు భాగా పని చేసి ఉంటే ఇంకా భాగా పని చేయాలని, భాగా పని చేయకపోయి ఉంటే ఇకపై భాగా పని చేయాలని తెలిపారు. వక్ఫ్‌బోర్డు వన్‌స్పెక్టర్‌లు నిజాయితీగా పని చేయాలని, ఎటువంటి రాజకీయ ఒత్తిళ్లు ఎదరైనా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. జిల్లాల వ్యాప్తంగా ఉన్న వక్ఫ్ఆస్తుల స్థితిగతులను పొందుపరచాలని, ఉన్న వక్ఫ్‌బోర్డు ఆస్తులతో సందప సృష్టించడానికి తీసుకోవాల్సిన చర్యలను సిద్ధం చేయాలని ఆదేశించారు. ముందుగా మిగిలి ఉన్న వక్ఫ్‌బోర్డు స్థలాలు అన్నింటికి జియో ట్యాగింగ్ పొందుపరచాలని అధికారులను ఆదేశించారు.



# ఉపాధి పనుల్లో రూ.59 లక్షలు అవినీతి

### ప్రజావేదికలో తేల్చిన అధికారులు

**సైదాపురం, డిసెంబర్ 20, ప్రభాతవార్త** సైదాపురం మండలంలో జాతీయ గ్రామీణ ఉపాధి పథకం ద్వారా 2023-24 ఆర్థిక సంవత్సరంలో జరిగిన 8కోట్ల88లక్షల పనులకు గాను రూ.59,08,368 అవినీతి జరిగిందని సంబంధిత జిల్లా ఉన్నతాధికారులు సామాజిక తనిఖీల్లో గుర్తించారు. శుక్రవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయం సమీపంలో డ్వామా పీడీ గంగాభవాని ఆధ్వర్యంలో శుక్రవారం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంపై సామాజిక ప్రజా వేదిక నిర్వహించారు. పంచాయతీల వారీగా డీఆర్పీలు తనిఖీ నివేదికలను చదివి వినిపించారు. ప్రతి పంచాయతీ నివేదిక చదివినప్పుడల్లా సదరు గ్రామస్తులు ఉపాధి పనుల్లో జరిగిన అవినీతిపై ఫిర్యాదులు చేశారు. ప్రధానంగా రాగనరామాపురం గ్రామస్తులు తమ గ్రామంలో లక్షల్లో అవినీతి జరిగిందని పీడీ ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా డ్వామా పీడీ గంగా భవాని మాట్లాడుతూ మండలంలో ఉపాధి పథకం కింద 2023-24 ఆర్థిక సంవత్సరానికి గాను 8కోట్ల 88 లక్షల రూపాయలు పనులు జరగ్గా అన్ని పంచాయతీల్లో కలిపి రూ.59,08,368 రూపాయలు మేర అవినీతి జరిగినట్లు గుర్తించామని తెలిపారు. ఎక్కువగా మండలంలోని రాగణరామాపురం పంచాయతీలో 18లక్షల 25వేల 937 అవినీతి జరిగిందని, అలాగే చీకవోలు గ్రామ పంచాయతీలో 14లక్షల 71వేల 810 రూపాయలు ఉపాధి పనుల్లో అవినీతికి పాల్పడడం జరిగిందని ఆమె తెలిపారు. దీనిపై విచారణ చేపడతామని ఎవరిని వదిలిపెట్టే ప్రసక్తి లేదని దుర్వినియోగం అయిన సొమ్మును రికవరి చేస్తామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏడీడీ నారాయణ, క్యూసీ ఏపీడీ సతీష్‌బాబు, ఎంపీడీఓ పురుషోత్తం శివకుమార్, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.



# గంజాయి అమ్మకం స్థావరాలపై దాడులు చేసిన టూటౌన్ పోలీసులు

### రెండున్నర కిలోల గంజాయి స్వాధీనం
### 7 మంది అరెస్ట్
### కావలి డీఎస్పీ పి శ్రీధర్

**కావలి, డిసెంబర్20 ప్రభాతవార్త** గంజాయి అమ్మకాలను తుదముట్టించి యువతను కాపాడాలన్న సంకల్పంతో కావలి టూటౌన్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ వి.గిరిబాబు పోలీసుసిబ్బందితో గంజాయి స్థావరాలపై ఆకస్మికదాడులు నిర్వహించారు. 55వేల రూపాయాలపైచిలుకు విలువ కలిగిన రెండు కిలోల ఐదువందల ముప్పైగ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. 7 మందిని అరెస్ట్ చేశారు. రెండు మోటార్ సైకిళ్లు, ఐదు సెల్‌ఫోన్స్ స్వాధీనపర్చుకున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం కావలి డీఎస్పీ కార్యాల యంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో కావలి డీఎస్పీ పి.శ్రీధర్ వివరాలు వెల్లడించారు. జిల్లా ఎస్పీ జి.కృష్ణకాంత్ ఆదేశాలమేరకు తన పర్యవేక్షణలో టూటౌన్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ గిరిబాబు సిబ్బందితో కలిసి గం జాయి అమ్మకాల స్థావరాలపై ఆకస్మికదాడులు నిర్వహించారు. ఇటీవల కాలంలో యువత, విద్యార్థులు గంజాయి తదితరవాటికి బానిసలై జీవితా లు నాశనం చేసుకుంటున్నారని డీఎస్పీ పి.శ్రీధర్ తెలిపారు. గంజాయిని పూర్తిస్థాయిలో తుదముట్టించాలని జిల్లా ఎస్పీ ఆదేశాలమేరకు పోలీసు నిఘావేయడం జరిగిందన్నారు. అందులో భాగంగా కావలి పెద్దపవనిరోడ్డు పి.జి కళాశాల ఎదురుగా, వైకుంఠపురం రైల్వేబ్రిడ్జికింద గంజాయి అమ్మకం దారులను నిఘావేసి వలపన్ని పట్టుకున్నారన్నారు. పశ్చిమగోదావరిజిల్లా దొరకొండ ప్రాంతంనుండి గంజాయి కొనుగోలు చేసినట్లు ముద్దాయిలు తెలిపారన్నారు. ఈ దాడుల్లో పట్టుబడ్డ 7 మంది గత కొంతకాలంగా గంజాయిని అక్రమంగా కొనుగోలుచేయడం, అమ్మడంవంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతూ అక్రమలాభాలు ఆర్జిస్తున్నారన్నారు. ప్రజలు, యువత ఆరోగ్యానికి హానికల్గించే చర్యలకు పాల్పడుతున్నారన్నారు. గంజాయిని పూర్తిస్థాయిలో అరికడతామని డీఎస్పీ పి.శ్రీధర్ తెలిపారు.

**ముద్దాయిలు వీరే** గంజాయిని అక్రమంగా అమ్ముతూ యువతను బానిసలుగా చేస్తున్న 8 మందిని గుర్తించగా, వారిలో 7 మందిని అరెస్ట్‌చేయడం జరిగిందని కావలి డీఎస్పీ పి.శ్రీధర్ తెలిపారు. కావలి పి.జి కళాశాల ఎదురుగా పెద్దపవని రోడ్డులో నివసిస్తున్న షేక్.మస్తానమ్మ, అదే ప్రాంతంలో నివసిస్తున్న షేక్.గౌస్‌బాషా, వైకుంఠపురంలో నివసిస్తున్న షేక్.మీరాబీ, లింగసముద్రం మండలం అన్నెబోయినపల్లి గ్రామానికి చెందిన దగ్గ చిన్నఅబ్బయ్య, ప్రకాశంజిల్లా నేకునాంపురం గ్రామానికి చెందిన కారంశెట్టి సుధాకర్, పొన్నలూరు మండలం మాలేపాడు గ్రామానికి చెందిన షేక్.గౌస్‌బాషా, అదే గ్రామానికి చెందిన షేక్.రసూల్‌బీలను అరెస్ట్ చేయడం జరిగిందన్నారు. తూర్పుగోదావరిజిల్లా కొటానందూరు మండలం, దొరకొండ గ్రామానికి చెందిన గంజాయి సరఫరా చేసిన వ్యక్తిని గుర్తించడం జరిగిందన్నారు. వీరితోపాటు రెండుకిలోల ఐదువందల ముప్పైగ్రాముల గంజాయిని స్వాధీనపర్చుకున్నామన్నారు. ఐదు సెల్‌ఫోన్లు, రెండు మోటా ర్‌బైక్‌లు కూడా స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. ఈ రోజు ఉదయం కావలి పెద్దపవనిరోడ్డు పి.జి కళాశాల ఎదురుగా అదుపులోకి తీసుకోవడం జరిగిందన్నారు. ఈ దాడుల్లో టూటౌన్ సి.ఐ వి.గిరిబాబు, ఎస్ఐ యస్‌కె. గౌస్‌బాషా, సిబ్బంది ముద్దాయిలను అరెస్ట్‌చేయడం జరిగిందన్నారు. వారిని కావలి డీఎస్పీ పి.శ్రీధర్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ సమావేశంలో టూటౌన్ సిఐ గిరిబాబు పాల్గొన్నారు. ముద్దాయిలతోపాటు గంజాయి, సీజ్ చేసిన వస్తువులను మీడియాకు చూపించారు.



## మాజీ ఎంపిపి పూర్ణయ్యను పరామర్శించిన ప్రతాప్‌రెడ్డి



**కావలి, డిసెంబర్20 ప్రభాతవార్త** : కావలి పట్టణ వైసిపినేత, మాజీ ఎంపిపి దామిశెట్టి పూర్ణయ్య అనారోగ్యంతో నెల్లూరులోని అమృత వైద్యశాలలో చికిత్స పొందుతున్నారన్న విషయం తెలుసుకున్న కావలి వైసిపి నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి శుక్రవారం పరామర్శించారు. వైసిపి నేతలతో ఆయన వైద్యశాలకు వెళ్లి దామిశెట్టి పూర్ణచంద్ర రావుతో మాట్లాడారు. అనారోగ్యానికి గల కారణాలను అడిగితెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని కోరారు. ఆయన వెంట వైసిపి పట్టణ అధ్యక్షుడు కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి, వైసిపి నేతలు కనమర్లపూడి వెంకటనారాయణ, చెన్ను ప్రసాదరెడ్డి, దామిశెట్టి సుధీర్ నాయుడు, గంధం ప్రసన్నాంజనేయులు, అయ్యవారు కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## మేలైన వ్యవసాయ సాగు పద్ధతులపై రైతులకు అవగాహన



**వరికుంటపాడు,డిసెంబర్ 20,ప్రభాతవార్త** : మేలైన వ్యవసాయ సాగు పద్ధతుల ద్వారా రైతుల అధిక లాభాలు పొందవచ్చని మండల వ్యవసాయాధికారి వి.రవికుమార్ అన్నారు.విరువూరు రైతు భరోసా కేంద్రం లో పొలంబడి(జి ఎ పి) నిర్వహించి రైతులకు అవగాహన కల్పించారు.విత్తన శుద్ధి ఎలా చేసుకోవాలో వివరించారు.అనంతరం శనగ పంట సాగులో పాటించాల్సిన మెలుకువలను వివరించారు.ఈ కార్యక్రమములో వివిఎలు శారదా ,చంద్రశేఖర్,ఆదిత్య,పవన్‌కుమార్,శ్రీకాంత్ ,రైతులు తదితరులు పాల్గొన్నారు.

## సర్వేలను త్వరితిగతిన పూర్తి చేయండి



**వరికుంటపాడు,డిసెంబర్ 20,ప్రభాతవార్త** : గ్రామ పంచాయతీలు,సచివాలయాల ద్వారా ప్రభుత్వం చేపట్టే సర్వేలను సిబ్బంది త్వరితిగతిన పూర్తి చేయాలని కందుకూరు డివిల్‌పిఓ కె.కృష్ణమోహన్ అన్నారు.మండలంలోని వరికుంటపాడు సచివాల యం, దక్కునూరు గ్రామ పంచాయతీ కార్యాల యాన్ని ఆయన తనిఖీ చేసి పలు రికార్డులను పరిశీలించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ పిఆర్-1 సర్వే,స్వర్ణ పంచాయతీ ప్యూరిఫికేషన్ లను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు.అలాగే ప్రతి గ్రామంలో అంటు వ్యాధులు ప్రబలకుండా ఎప్పటికప్పుడు శానిటేషన్ పనులు చేపట్టాలని సూచించారు.ఈ కార్యక్రమములో ఈఓపిఆర్‌డి నాగూర్‌వళి, వరికుంటపాడు గ్రామ సర్పంచ్ కొండెపోగు దిలీప్ కుమార్,రాష్ట్ర గిరిజన కార్పోరేషన్ డైరెక్టర్ ఆవుల అరుణ,పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్,సుల్తాన్ భాష తదితరులు పాల్గొన్నారు.

## చేతిపంపుచుట్టూ మురికి

– గ్రామం వైపు కన్నెత్తి చూడని అధికారులు



**మర్రిపాడు, డిసెంబర్ 20, ప్రభాతవార్త:** మండలంలోని ఇస్కపల్లిలో గ్రామం నడిబోడ్డున బోరు దగ్గర మురికి నీరంతా చేరి దుర్వాసన కొడుతుంది. సైడు కాలువలు లేక పక్క ఇళ్లనుంచి వచ్చి మడుగుగా ఏర్పడి ఎటూ పోయే పరిస్థితి లేక మురికి నీరుండడం వలన ఇరుకుటుంబాల వారు గొడవలు పడుతున్నారు. ఆమురికి గుంటల్లో దోమ లు స్వేరవిహారం చేస్తున్నాయి. దోమల వలన ఏ జబ్బులు వస్తాయోనని , ఏదోమ వచ్చి కుడుతు ంధోనని ప్రజలు భయపడుతున్నారు. గ్రామంలో పరిస్థితులు ఎలా ఉన్నాయి ప్రజలు ఎలా ఉన్నారు అని సంబంధిత అధికారులు కన్నెత్తి చూసే పరిస్థితి కూడా లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు గ్రామాన్ని సందర్శించి మురికి గుంటల సత్వర పరిష్కార మార్గం చూపి సీజనల్ వ్యాధులు, విషజ్వరాలు రాకుండా కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

## గంగాభవాని అమ్మవారి గ్రామోత్సవం



**వింజమూరు, డిసెంబర్ 20, ప్రభాతవార్త:** వింజమూరులోని పాతూరులో వేంచేసి యున్న శ్రీ గంగాభవాని అమ్మవారు తిరునాల సందర్భంగా శుక్రవారం అమ్మవారి నిలుపు, సాయంత్రం అమ్మవారి గ్రామోత్స వాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉదయాన్నే అమ్మవారికి గంగమ్మతల్లి భక్తబృందం అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారు జలిదిలోకి వెళ్ళే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. సాయంత్రం అమ్మవారిని పూలతో ప్రత్యేకంగా అలంకరించి రథం అధిష్టింపచేసి వీరతాళ్ళు, కోలాటం, భజనలు , బాణాసంచా మోతల మధ్య అమ్మవారిని గంగమిట్టనుండి యర్రబల్లిపాళెం , బంగ్లాసెంటర్ వరకు గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని కనులారా దర్శించి మొక్కులు తీర్చుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. శనివారం జమ్మి వృక్షం వద్ద కార్యక్రమాలు , ఆదివారం పొంగళ్ళు, బండ్లు తిరుగు కార్యక్రమాలు నిర్వహిస్తారని గంగమ్మ ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొనాలని వారు కోరారు.

## నల్లగొండ్లలో రెవెన్యూ సదస్సు



**వింజమూరు,డిసెంబర్20,ప్రభాతవార్త:** వింజమూరు మండలం నల్లగొండ్ల గ్రామంలో శుక్రవారం రెవెన్యూ సదస్సును నిర్వహించారు. తహసిల్దార్ హమీద్ ఆధ్వ ర్యంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు 185అర్జీలు వచ్చాయన్నారు. అందు లో ముటేషన్లకు సంబంధించి 75, సాగు భూములకు పట్టాలు మంజూరుకొరకు 78, భూములను సర్వే చేయాలని 32 అర్జీలు వచ్చాయని వారు తెలిపారు. ఈకార్యక్రమంలో విఆర్ఓ నర్శింహారెడ్డి, మండల సర్వేయర్ రవి, గ్రామ సర్వేయర్ సతీష్, కంప్యూటర్ ఆపరేటర్ ప్రసాద్, గ్రామస్తులు పాల్గొన్నారు.

## మేలుజాతి పశు ఉత్పత్తికి పాడి రైతులు చొరవ తీసుకోవాలి



**కోవూరు, డిసెంబరు 20 ప్రభాతవార్త** : గ్రామాల్లో మేలుజాతి పశువుల ఉత్పత్తిపై సంబంధిత పాడి రైతులు ప్రత్యేక దృష్టి సారించాలని కోవూరు పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ కృష్ణమౌర్య తెలిపారు. కోవూరు మండలం గంగవరం గ్రామంలో శుక్రవారం జిల్లా పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఎస్ఈపీ యాక్షన్ ప్లాన్ కింద ఉచిత గర్భకోశ వ్యాధి పశు వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని గ్రామ సర్పంచ్ లక్ష్మీకుమారి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు మేలుజాతి పశువుల అభివృద్ధికి గానూ లింగ నిర్ధారిత వీర్యం ద్వారా కృత్రిమ గర్భధారణ చేసి పెయ్యదూడల ఉత్పత్తి పథకం అమలుకు శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు. ప్రస్తుతం జిల్లాలో 20 వేల పెయ్యదూడలు ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా నిర్ణయించడం జరిగిందన్నారు. ఒక్కొక్క పశువుకు ప్రభుత్వం రెండు లింగ నిర్ధారిత వీర్య నాళికలకు గానూ 1350 రూపాయలను మంజూరు చేయగా.. అందులో 850 రూపాయలు రైతుకు సబ్సిడీ ఇచ్చి కేవలం 500 రూపాయలు మాత్రమే రైతు చెల్లించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కృత్రిమ గర్భధారణ ద్వారా పెయ్యదూడలను పొందవచ్చన్నారు. ఒక పశువు ఎదకు వచ్చినప్పుడు అండాశయం నుంచి ఒకే అండం విడుదల అవుతుందని, ఈ పరిస్థితుల్లో కృత్రిమ గర్భోత్పత్తి ద్వారా వీర్య దానం చేయించినప్పుడు చూలు కట్టడం జరుగుతుందన్నారు. చూలు కాలం పూర్తయ్యాక దూడ పుడుతుందని, ఈ రకమైన పాడి పశువు తన జీవిత కాలంలో 8 నుంచి 10 దూడలకు జన్మనిస్తుందన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో డాక్టర్ ప్రీతి సాల్మన్, డాక్టర్ షబానాలు రైతులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ పాడి రైతులు ఉన్నారు.

## మ్యాథ్స్ ప్రాజెక్టులు విజయవంతం



**కోవూరు, డిసెంబరు 20 ప్రభాతవార్త** : కోవూరులోని కోనమ్మతోటలో ఉన్న న్యూ లిటిల్ ఫ్లవర్ ఆంగ్ల మాధ్యమ పాఠశాలలో శుక్రవారం గణిత మేధావి శ్రీ రామానుజన్ జయంతి సందర్భంగా పాఠశాలలో ముం దస్తుగా నిర్వహించిన గణితం ఫేర్‌లో విద్యా ర్థులు 150కి పైగా గణిత ప్రాజెక్టులను ప్రద ర్శించారు. వీటిని కోవూరు ఎస్సై రంగనాథ్ గౌడ్ , మండల స్పోర్ట్స్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు అశోక్‌కుమార్, కరస్పాండెంట్ నందకిషోర్‌లు నిశిత పరిశీలన చేపట్టి ఈ ప్రాజెక్టులో రూపొందించిన పలు వాటిని ప్రదర్శించి విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థులు గత వారం రోజులుగా ప్రత్యేకంగా శ్రమ తీసుకుని తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సహకారంతో రూపొందించిన ఈ ప్రాజెక్టులు ప్రతి ఒక్కరినీ ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ గణిత ఫేర్‌లో విద్యార్థుల తల్లిదండ్రులు కూడా ఉత్సాహంగా పాల్గొని తమ చిన్నారులను హృదయపూర్వకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ అనిత, ప్రధానోపాధ్యాయులు కోటయ్య, ఇన్‌చార్జి విజయలక్ష్మి, ఉపాధ్యాయులు ఉన్నారు.

## గర్భకోశ వ్యాధుల శిబిరం విజయవంతం



**కోవూరు, డిసెంబరు 20 ప్రభాతవార్త** : కోవూరు మండలం గంగవరం గ్రామంలో శుక్రవారం జిల్లా పశు సంవర్ధక శాఖ సహకారంతో ఎస్ఈపీ యాక్షన్ ప్లాన్‌లో నిర్వహించిన ఉచిత గర్భకోశ వ్యాధి పశు వైద్య శిబిరం విజయవంతమైంది. ఈ శిబిరంలో పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ కృష్ణమౌర్య పర్యవేఓణలో పశు వైద్యులు డాక్టర్ ప్రీతి సాల్మన్, డాక్టర్ షబానాలు 31 పశువులకు గర్భకోశ సంబంధిత పరీక్షలు, 200 కోళ్లకు నట్టల నివారణ మందులు, 98 పశువులకు గొంతు వాపు నిరోధక టీకాలను , 70 గొర్రెలకు నట్టల నివారణ మందులు, 81 పశువులకు జనరల్ కేసులను పరీక్షించి వారికి ఉచితంగా మినరల్ మిర్చర్, గర్భకోశ వ్యాధి మందులను గ్రామ సర్పంచ్ లక్ష్మీకుమారి, చేతుల మీదుగా 20 వేలు విలువ చేసే మినరల్ మిర్చర్, గర్భకోశ వ్యాధి మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సహాయ సంచాలకులు డాక్టర్ కృష్ణమౌర్య మాట్లాడుతూ ప్రతి రైతు తన పొలంలో మేలుజాతి పశు గ్రాసాల అభివృద్ధికి దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. ఈ పశుగ్రాసానికి అవసరమైన విత్తనాలను 75 శాతం సబ్సిడీతో పంపిణీ చేయడం జరుగుతుందని, ఇటువంటి మంచి అవకాశాన్ని పాడి రైతులు పూర్తిస్థాయిలో ఉపయోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ లక్ష్మీకుమారి, సజ్జాద్ అహ్మద్, గ్రామ పశు సహాయకులు , పాడి రైతులు ఉన్నారు.

## కండలేరులో 55.744 టీయంసీల నిటిమట్టం

**కండలేరుడ్యాం(రాపూరు),డిసెంబరు20ప్రభాతవార్త** : మండలంలోని కండలేరు జలాశయంలో శుక్రవారం ఉదయానికి 56.744 టీయంసీల నిటిమట్టం నమోదు అయినట్లు కండలేరు ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు. ఇందులో సోమశిల.కండలేరు వరద కాలువ ద్వారా 1100 క్యూసెక్కులు,వరదనీటి రూపేణా 600 క్యూసెక్కుల చొప్పున మొత్తం 1700 క్యూసెక్కులు ఇన్‌ఫ్లోగా జలాశయంలోకి వస్తుండగా అవుట్‌ఫ్లోగా జలాశయం హెడ్ రెగ్యులేటర్ నుండి 905 క్యూసెక్కులు,లో లెవల్ స్లూయిస్ ద్వారా 10 క్యూసెక్కులు, హైలెవల్ కెనాల్ ద్వారా 160 క్యూసెక్కుల చొప్పున మొత్తం 1075 క్యూసెక్కుల నీరు అవుట్ ఫ్లోగా వెలుతున్నట్లు ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు.

## భాషా గణితం పై పట్టు సాధించాలి



**వెంకటాచలం,డిసెంబర్ 20 , ప్రభాతవార్త:** ఫౌండేషనల్ లిటర్సీకు సంబంధించి, నెల్లూరు జిల్లాలోని వెంకటాచలం మండలం, గొలగమూడి దగ్గర ఉన్న ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ ట్రావెల్ మెనేజ్మెంట్ నందు 16.12.2024 నుండి 21.12.2024 వరకు 6 రోజుల పాటు జరుగుతున్న ఎఫ్ఎల్ఎన్ శిక్షణా కార్యక్రమానికి ఎస్సీఈఆర్టీ లెక్చరర్ మాధవి మేడం అబ్జర్వర్ గా ఈరోజు సందర్శించడమైనది. కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ ప్రాథమిక తరగతులలో ముఖ్యంగా 1,2 తరగతులలో భాష, గణిత పరంగా పునాది బలంగా ఉంటే పిల్లలు అద్భుతమైనటువంటి ఫలితాలను సాధించగలుగుతారని, శిక్షణలో అందించే సూచనలను ఉపాధ్యాయులందరూ వారి వారి పాఠశాలలో అమలుపరిచి 2026-27 సంవత్సరానికల్లా 3వ తరగతి పూర్తి అయ్యేసరికి ఆయా తరగతులకు సంబంధించినటువంటి అభ్యసన ఫలితాలను సాధించేటట్లు కృషి చేయాలని, తల్లిదండ్రులతో మంచి సంబంధాలను మెరుగు పరుచుకోవాలని, గుణాత్మక విద్యను అందించాలని , సమయ పాలనను, సమయ విలువను గురించి తెలియజేశారు. ఎఫ్ఎల్ఎన్ శిక్షణకు ముందు, ఎఫ్ఎల్ఎన్ శిక్షణకు తర్వాత ఉన్నటువంటి తేడాను తరగతి గదిలో అమలుపరచి విజయవంతం చేయాలని కోరారు. ప్రాథమిక దశ నుంచే విద్యకు సంబంధించి పిల్లలలో నిర్దిష్టమైనటువంటి లక్ష్యాలను ఏర్పాటు చే చేయాలని కోరారు. శిక్షకులచే వారి అభిప్రాయాలను మాట్లాడించడం జరిగింది. ఈ శిక్షణ చాలా బాగున్నదని, శిక్షణలో వసతులు చాలా బాగున్నాయని, రిసోర్స్ పర్సన్స్ అన్ని విషయాలను చక్కగా వివరిస్తున్నారని తెలియజేయడం జరిగింది. అనంతరం శిక్షకులు తయారుచేసిన టిఎల్ఎమ్/ఐఎల్ఎమ్ మేడం గారు పరిశీలించి ప్రశంసించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా సమగ్ర శిక్ష అకడమిక్ మానిటరింగ్ అధికారి గారు శ్రీ జి.సుధీర్ బాబు గారు, ఇతర అధికారులు, రిసోర్స్ పర్సన్స్, శిక్షకులు పాల్గొనడం జరిగింది.

## జనసేన చొరవతో డంపింగ్‌యార్డు తొలగింపు



**కలువాయి డిసెంబర్ 20 ప్రభాతవార్త** : మండలకేంద్రమైన కలువాయిలోని నవభారతి హైస్కూల్ వెనుకభాగం వీధిలో ఏళ్ల తరబడి డంపింగ్ యార్డు లాగా ఏర్పడిన చెత్తా చెదారాలను మండల జనసేన పార్టీ చొరవతో శుక్రవారం పంచాయితీ సిబ్బంది తొలగించారు. ఆప్రాంతంలో చెత్తా చెదారాల ద్వారా దోమల వ్యాప్తి అదే విధంగా దుర్వాసనతో ఇబ్బంది పడుతున్న ప్రజలు జనసేన పార్టీ నాయకులు దృష్టికి తీసుకొని రావడంతో మండల అధ్యక్షులు మనోహర్ సంబందిత అధికారులకు తెలియపరచడంతో ఆ ప్రాంతంలో చెత్తా చెదారాలను ట్రాక్టర్లతో తొలగించారు. ఈకార్యక్రమంలో నాయకులు సుంకు రామకిషోర్, సుపర్లహరి, నాగయ్య, సురేష్, హరి ప్రసాద్, నరేష్,ప్రవళిక ,బాబురావు తదితరులు పాల్గోని కార్యక్రమానికి సహకారం అందించారు.

## ప్రభుత్వ నిధులు దుర్వినియోగంపై క్రిమినల్ కేసు



**కలువాయి డిసెంబర్ 20 ప్రభాతవార్త** : ఉపాధీహామి 16 వ విడత సామాజిక తనీఖీలు అక్రమాలకుపాలుపడిన 6 మందిపైన మండల అభివృద్ధి అధికారి నరసింహరావు శుక్రవారం స్దానిక పోలీస్‌స్టేషన్ నందు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదులో చిన్నగోపవరం కు చెందిన క్షేత్ర సహాయకుడు ఆదిరెడ్డి మహేంద్రరెడ్డి, కంప్యూటర్ ఆపరేటర్ పి బాబు, రాజేష్ 25.50 లక్షల రూపాయాలు సాంకేతిక సహాకులు ఆర్.ప్రసన్న.ఎం.వి ప్రసాద్,ఎమ్ వెంకటేశ్వర్లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ జె.శ్రీనయ్య 32.87 లక్షలు అవకతవకలు జరిగి ప్రభుత్వ నిధులు దుర్వినియోగం జరిగినట్లు నిర్దారణ కాగా ఈనేపద్యంలో వారిపై క్రిమినల్ కేసును నమోదు చేయాలని పోలీస్ స్టేషన్‌లో ఎంపిడిఓ ఫిర్యాదు చేశారు.

## కావలిడిపోలో ప్రారంభించిన డోర్ డెలివరీ మాసోత్సవాలు

### జిల్లా ప్రజారవాణాధికారి మురళిబాబు



**కావలి, డిసెంబర్20 ప్రభాతవార్త** : ఎపియస్ఆర్‌టిసి అందిస్తున్న పార్శిల్ కొరియర్ సరుకు రవాణాసేవల గురించి ఆర్‌టిసి కార్మికులు విస్తృతంగా ప్రచారం చేయాలని శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరుజిల్లా ప్రజారవాణాధికారి (డిపిటిఓ) మురళిబాబు తెలిపారు. కావలి ఆర్‌టిసి డిపోలో శుక్రవారం డోర్ డెలివరి మాసోత్సవాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. దేశంలోనే మొదటిసారిగా ఎపియస్ఆర్‌టిసి సరుకు రవాణాసేవలను ప్రారంభించిందన్నారు. ఈ స్ఫూర్తితో తెలంగాణ ఆర్‌టిసితోసహా పలు రాష్ట్రాల ఆర్‌టిసి సంస్థలు కార్గోసేవలు ప్రారంభించాయన్నారు. ఇప్పటికి కొన్ని రాష్ట్రాల ఆర్‌టిసి అధికా రులు ఎపియస్ఆర్‌టిసి అందిస్తున్న సేవలను అధ్యయనం చేయడానికి వస్తున్నారన్నారు. ఎపియస్ ఆర్‌టిసి రాష్ట్రంలోనే 80 పట్టణాల్లో డోర్ డెలివరి సేవలను ప్రారంభించిందన్నారు. 50 కేజీలవరకు డోర్ డెలివరి చేస్తుందన్నారు. మన ఆర్‌టిసి అందించినంత వేగంగా ఇతర ఏ ప్రైవేటు రవాణాసంస్థలు సరుకు డెలివరి చెయ్యలేవని తెలిపారు. డోర్‌డెలివరి మాసోత్సవాల సందర్భంగా ప్రతికార్మికుడు కార్గోసేవల గురించి తమతమ పరిధిలో విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. ఈ మాసోత్సవాల్లో ప్రతి ఉద్యోగి కనీసం నలుగురు నుండి డోర్‌డెలివరి పార్శిల్‌లు బుక్‌చేయాలన్నారు. రాబోయే క్రిస్మస్, నూతన సంవత్సరం, సంక్రాంతి పండుగల సందర్భంగా తమ పరిధిలోనివారిచే గ్రీటింగ్స్, దుస్తులు, స్వీట్లు రవాణాచేయించి ఎపి యస్ఆర్‌టిసి అభివృద్ధికి సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ దివ్య కామాక్షి, కావలి డిపో అసిస్టెంట్ మేనేజర్ కల్పన, అసిసెంట్ ఇంజనీర్ ఖాజామొహిద్దీన్, కావలి బస్‌స్టేషన్ ఇన్‌చార్జి రమేష్‌బాబు, రీజియన్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ పెంచలయ్య, డిపో మార్కెటి ంగ్ ఎగ్జిక్యూటివ్ దాకారపు రవిప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

## సర్వాయపాళెంలో అక్రమ మద్యం విక్రయాలపై దాడులు

### 12 మద్యం బాటిళ్లు స్వాధీనం



**కావలి, డిసెంబర్20 ప్రభాతవార్త** : కావలి రూరల్ మండలం సర్వాయపాళెం గ్రామం లో చట్టవిరుద్ధంగా మద్యం విక్రయాలు నిర్వహి స్తున్నవారిపై కావలి ప్రొహిబిషన్, ఎక్సైజ్ సరి ్కల్ ఇన్స్‌పెక్టర్ ఎస్.శ్రీనివాసులు, ఎస్ఐ దేవిక, పోలీసుసిబ్బంది శుక్రవారం దాడులు నిర్వహి ంచారు. ఈ దాడుల్లో ఇస్సారపు శీనయ్య వద్ద ఉన్న 12 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకు న్నారు. అతనిని అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ శ్రీనివాసులు తెలిపారు.

## కేంద్రమంత్రి అమిత్‌షా భారతజాతికి క్షమాపణ చెప్పాలి

**కావలిరూరల్, డిసెంబర్20 ప్రభాతవార్త** : పార్లమెంట్ సాక్షిగా భారతరాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్‌ను అవమానపర్చిన కేంద్ర హోమ్‌శాఖమంత్రి అమిత్‌షా భారతజాతికి క్షమాపణ చెప్పాలని కెవిపియస్ జిల్లా అధ్యక్షులు కె.జాన్, వ్యవసాయ కార్మికసంఘం రాష్ట్రకమిటి సభ్యులు టి.మాల్యాద్రి, కావలి మండల కార్యదర్శి ఎం.రాధాకృష్ణయ్యలు సంయుక్తంగా ఒక ప్రకటనలో డిమాండ్‌చేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పార్లమెంట్‌లో అమిత్‌షా డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌ను ఎన్నిసార్లు గుర్తుచేస్తారు, దానికి బదులుగా హిందూదేవుళ్లను స్మరించుకుంటే ఏడుజన్మలదాకా పుణ్యం వస్తుందని అవహేళనచేయడం జరిగిందని దీనిని ప్రజలు, ప్రజాప్రతినిధులు ఖండించాలని తెలియచేశారు. ప్రధాని నరేంద్రమోడి హోమ్‌మంత్రి అమిత్‌షా చేసిన ప్రకటనను ఖండించకపోగా వెనుకేసుకురావడం సమంజసం కాదని తెలియచేశారు. పార్లమెంట్‌లో డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌ను అవమానపర్చి మాట్లాడిన కేంద్ర హోమ్‌శాఖమంత్రి అమిత్‌షా భారతజాతికి క్షమాపణచెప్పాలని హోమ్‌మంత్రి పదవినుండి, పార్లమెంట్ మెంబర్ పదవి నుండి తొలగించాలని తెలియచేశారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగంమీద ప్రమాణంచేసి పార్లమెంట్‌లోకి ప్రవేశించిన అమిత్‌షాపై కఠినచర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేయడం జరిగింది.

## గుర్తుతెలియని వాహనం ఢీకొని మహిళ మృతి

**నెల్లూరు క్రైమ్, డిసెంబర్ 20, ప్రభాతవార్త** : గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఒక మహిళ మృతి చెందిన సంఘటన స్థానిక ఎన్టీఆర్ నగర్ బైపాస్ రోడ్డుపై శుక్రవారం చోటుచేసుకుంది. స్థానిక భగత్ సింగ్ కాలనీకి చెందిన జైనుల్లా తన భార్య మస్తానమ్మ (59)తో కలిసి మనుబోలు మండలంలోని గురువింద పూడి గ్రామంలో శుభకార్యం లో పాల్గొని తిరిగి ఇంటికి వస్తుండగా, ఎన్టీఆర్ నగర్ సమీపంలో జాతీయ రహదారిపై వీరి మోటార్ సైకిల్ ను వెనక నుండి గుర్తు తెలియని వాహనం ఢీకొనింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలు పాలైన మస్తానమ్మ అక్కడికక్కడే మృతి చెందారు. జైనుల్లాకు గాయాలయ్యాయి. సమాచేశం తెలుసుకున్న ట్రాఫిక్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని కేసు దర్యాప్తు చేపట్టారు.

## రోడ్డు భద్రతపై అవగాహన సదస్సు



**కందుకూరు, డిసెంబర్ 20, ప్రభాతవార్త** : ప్రాంతీయ రవాణా శాఖ అధికారి వారి కార్యాలయం కందుకూరులో శుక్రవారం స్కూల్, కాలేజీ బస్సు డ్రైవర్లకు, ఆటో డ్రైవర్లకు రోడ్డు భద్రతపై అవగాహన సదస్సును ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రాంతీయ రవాణా శాఖ అధికారి టీవీఎన్ లక్ష్మీ మాట్లాడుతూ ప్రతి ఒక్క స్కూల్ బస్ డ్రైవర్, ఆటో డ్రైవర్ రోడ్డు సేఫ్టీ రూల్స్‌ను తూచా తప్పకుండా పాటించాలని, ముఖ్యంగా స్కూల్ బస్సు డ్రైవర్లు వెహికల్ స్టార్ట్ చేసేటప్పుడు చుట్టు పక్కల చూసి జాగ్రత్త వహించి ముందుకు వెళ్లాలని అదే విధంగా ఓవర్ స్పీడ్ వెళ్లకుండా, సెల్ఫోన్ డ్రైవింగ్ చేస్తూ డ్రైవింగ్ చేయకూడదని తెలియజేశారు. ముఖ్యంగా 60 సంవత్సరాలు దాటిన డ్రైవర్ సోదరులు స్వచ్ఛందంగా స్కూల్ బస్సులు నడుపుకుంటూ ఉండాలని తెలియజేశారు. ముఖ్యంగా మీ మీద మీ కుటుంబం మీద ఆధారపడి ఉంటారు, మీ నిర్లక్ష్యంతో కుటుంబాన్ని రోడ్డున పడవేయవద్దని మీ నిర్లక్ష్యమే యముడికి ఆయుధం కనుక ప్రతి ఒక్క డ్రైవర్ సోదరులు ట్రాఫిక్ నియమ నిబందనలు పాటిస్తూ రోడ్డు ప్రమాదాలు భారిన పడకుండా ఉండగలరని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా మోటారు వాహనాల తనిఖీ అధికారి చెన్నూరి రాంబాబు మాట్లాడుతూ ప్రతి ఒక్క డ్రైవర్ ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ రోడ్డు ప్రమాదాల భారిన పడకుండా ఉండాలని ఉంటారని అదే విధంగా స్కూల్ బస్సు నడుపు డ్రైవర్లు మరియు బస్సు నందు అటెండెంట్ ఉండి స్కూల్ పిల్లలు వాహనం ఎక్కినప్పుడు దిగునప్పుడు ముందు వెనుక గమనిస్తూ ఎవరు లేరని గమణించుకున్న తర్వాత వాహనం ముందుకు వెళ్లేలా చూసుకోవాలని తెలియజేశారు. అదేవిధంగా డ్రైవర్లు యూనిఫామ్ కూడా ధరించి డ్రైవ్ చేయాలని సూచించారు. ఎవరైనా బాధ్యతారాహిత్యంగా వాహనం నడిపిన అట్టి వారిపై చర్యలు తీసుకోబడునని తెలియజేశారు.

## ఉదయగిరి సామాజిక ఆరోగ్య కేంద్రం కమిటీ సమావేశం



**ఉదయగిరి, డిసెంబర్ 20, ప్రభాతవార్త** : మెట్ట ప్రాంతమైన ఉదయగిరి నియోజక వర్గంలోని ఉదయగిరి సామాజిక ఆరోగ్య కేంద్రం కమిటీ సమావేశం ఆసుపత్రి కమిటీ చైర్మన్ ఎమ్మెల్యే కాకర్ల సురేష్ అధ్యక్షతన జరిగింది. గురువారం జరిగిన ఈ సమావేశంలో కమిటీ సభ్యులు కలివెల జ్యోతి భాస్కర్ డాక్టర్ అనీషా ఎంపీడీఓ, ఉదయగిరి టీడీపీ మండల కన్వీనర్ సీహెచ్ వయ్యన్న ఎస్కే రియాజ్ సమక్షంలో జరిగిన ఈ సమావేశంలో ముఖ్యంగా ఆసుపత్రి డ్రైనేజీ సమస్య అధిగమించేందుకు తీసుకోవాల్సిన చర్యల గురించి సమాలోచన చేశారు. అదేవిధంగా గైనకాలజిస్టు డాక్టర్, జనరల్ సర్జన్ డాక్టర్ల కొరత మరియు సిబ్బంది కొరతను అధికగమించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ తెలిపారు. మెట్ట ప్రాంత వాసులకు మెరుగైన వైద్య సదుపాయం అందించడమే తమ ధ్యేయం అన్నారు. ఉదయగిరి నుండి ఎటు వెళ్లాలన్నా సుమారు 100 కిలోమీటర్లు ప్రయాణం చేయాల్సి ఉందని అందుచేత 50 పడకలుగా ఉన్న ఈ ఆసుపత్రిని వంద పడకలు చేసేందుకు అసెంబ్లీల కూడా మాట్లాడటం జరిగిందని తెలిపారు. మెట్ట వాసులకు ఆరోగ్య భద్రత కల్పిస్తానన్నారు. ఈ సందర్భంగా వివిధ సమస్యలపై అక్కడికి వచ్చిన వారితో మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా పని చేయడం జరుగుతుందని, అర్హులందరికి ప్రభుత్వ పథకాలు అందించడమే తమ లక్ష్యం అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఇతర టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పండుగ సమయాల్లో అప్రమత్తంగా ఉండండి



**బిట్రగుంట డిసెంబర్ 20 ప్రభాతవార్త:** బిట్రగుంట పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో రానున్న క్రిస్మస్, నూతన సంవత్సరం, సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని, అజాగ్రత్తగా ఉంటే చోరీలు జరిగే అవకాశం ఉందని బిట్రగుంట ఎస్సై భోజ్యానాయక్ తెలియజేశారు. ఈ మేరకు మండలంలోని అన్ని గ్రామాల్లో శుక్రవారం ఆటో ద్వారా ప్రజల్లో అవగాహన కలిగించేందుకు విస్తృత ప్రచారం నిర్వహించారు ఎవరైనా ఎక్కడైనా అనుమానాస్పదంగా తిరుగుతున్న తమ దృష్టికి తీసుకురావాలని అంతేకాకుండా అసాంఘిక కార్యకలాపాలకు ఎవరు పాల్పడకుండా దూరంగా ఉండాలని, పాల్పడిన వారి పట్ల శిక్షలు కఠినంగా ఉంటాయని హెచ్చరించారు.

## చెంచులక్ష్మీపురం లో ఇంటింటి సర్వే

**బిట్రగుంట డిసెంబర్ 20 ప్రభాతవార్త:** బోగోలు మేజర్ పంచాయతీ లోని చెంచులక్ష్మీపురం నందు వైద్యశాఖ ఆధ్వర్యంలో రామాలయం ముందు శుక్రవారం మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ మెడికల్ క్యాంప్ లో భాగంగా కోవూరు పల్లి మెడికల్ ఆఫీసర్ రాజశేఖర్ ఇంటింటికి తిరిగి దోమలు వ్యాప్తి చెందకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు. కావలి సబ్ యూనిట్ ఆఫీసర్ పి. లక్ష్మీ నరసింహం ప్రతి వీధిలో, ఇళ్ళలో దోమ నివారణ మందులను పంచాయతీ సిబ్బంది ద్వారా పిచికారి చేయించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## వైస్సార్సీపీ జిల్లా ఆర్టిఐ విభాగం అధ్యక్షులు గా వీరరఘు



**బిట్రగుంట డిసెంబర్ 20 ప్రభాతవార్త:** వైస్సార్సీపీ జిల్లా ఆర్టిఐ విభాగం అధ్యక్షులు గా బోగోలు మండల వైస్సార్సీపీ సీనియర్ నేత మండల కన్వీనర్ మద్దిబోయిన వీరరఘు యా దవ్ ను నియమిస్తూ వైస్సార్సీపీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కాకాని గోవర్ధనరెడ్డి ఉత్తరువులు జారి చేసారు. తనను నియమించినందుకు జిల్లా అధ్యక్షులు గోవర్ధనరెడ్డి కి, కావలి నియోజ కవ ర్గం సమన్వకర్త, మాజీ శాసనసభ్యులు రామి రెడ్డి ప్రతాపకుమారరెడ్డి కి ఈ సందర్భంగా రఘుకృతజ్ఞతలు తెలిపారు.

## సర్వ సాధారణంగా గ్రామసభలు కొడవలూరు




**(విడవలూరు), డిసెంబర్ 20, ప్రభాతవార్త :** మండలం నార్త్ రాజు పాలెం, రామన్నపాలెం గ్రామాలలో రెవెన్యూ సదస్సు గ్రామసభ కార్యక్రమం తాసిల్దార్ స్ఫూర్తి రెడ్డి ఆధ్వర్యంలోనిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు సర్వేలో జరిగిన భూమి తక్కువ, ఎక్కువ విస్తీర్ణం, వన్ బి, అడంగల్ లో పేర్లు మార్పులు సమస్యలు ఉన్నట్లయితే పూర్తిస్థాయిలో పరిశీలన చేసి రైతులకు భూశాశ్వత పరిష్కారం జరుగుతుందన్నారు. అలాగే మండలంలో ఆధార్ కార్డుల సమస్య ఉన్న గ్రామసభలో అర్జీలు స్వీకరిస్తాం ఈ కార్యక్రమంలో సర్వేయర్ శ్రీలత, ఆర్ఐ సునీల్, వీఆర్వోలు సుబ్రహ్మణ్యం, ప్రియదర్శిని, మల్లికార్జున్, గ్రామ సర్వే సంతోష్, మహేంద్ర, సుధామణి, టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## గీతా జయంతి సందర్భంగా ఉచిత వైద్య శిబిరం



**నల్లూరు, డిసెంబర్ 20, ప్రభాతవార్త-వద్యం :** నగరంలోని స్థానిక కొండాయపాలెం గేట్ సెంటర్, శ్రీ రాధాకృష్ణ ధ్యాన మందిరంలో శుక్రవారం గీతా వైభవ్ ట్రస్టు, కమ్యూనిటీ పారా మెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్, శ్రీ సాయి యోగ ధ్యాన మందిరం సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని గీతా ప్రబోధక్ ట్రస్టు చైర్మన్, బ్రహ్మశ్రీ నజీర్ భాషా గురూజీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గీతా జయంతి సందర్భంగా జరిగిన కార్యక్రమంలో గీతా వైభవ్ ట్రస్టు సలహా కమిటీ సభ్యులు నరసాపురం ప్రసాద్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయడం ఎంతో అభినందనీయమని అన్నారు. గీతా జయంతి రోజు నెల్లూరు నగరంలోని వివిధ పాఠశాలలు, కళాశాలల విద్యార్థినీ, విద్యార్థులు ఉపాధ్యాయులు, అధ్యాపకులు, పుర ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారని తెలిపారు. వీరి కోసం ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ ఉచిత వైద్య శిబిరంలో పాల్గొని వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పీహెచ్‌పీ నాయకులు శాఖవరపు వేణుగోపాల్, గోరంట్ల శేషయ్య, నరసాపురం ప్రసాద్, దేవరకొండ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## రెవిన్యూ సదస్సులో రైతులు నిరసన



**సీతారామపురం డిసెంబర్ 20 ప్రభాతవార్త :** సీతారామపురం మండలంలోని అయ్యావారిపల్లి గ్రామంలో రెవిన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాలమహాసేన ఉపాధ్యాక్షులు బొగ్గవరపు రత్నం ఆధ్వర్యంలో రైతులు నిరసన కార్యక్రమం చేపట్టారు. సుమారు 45 సంవత్సరాల క్రితం సిజిఎఫ్ ఎస్ భూములు ఇచ్చారని అప్పటి నుండి ఇప్పటి వరకు పేదల సాగు చేసుకొని అనుభవిస్తున్నామని తెలిపారు. సర్వేనెంబర్ 220 ,221లో 16 ఏకరాల భూమిని 16 మందికి ఇవ్వగా 2018లో ఈ భూములు ఆన్ లైన్ చేయడం జరిగింది. కొంతమంది అధికారులు రికార్డులు సరిగా పరిశీలించకుండా ఒకరి భూమిని మరొకరి పేరుతో ఆన్‌లైన్ చేసి అందర్ని అయోమయానికి గురి చేశారు. ఈవిషయమై జిల్లా కలెక్టర్‌కి, మండలస్థాయి అధికారులకు విన్నవించకుండా సైట్ ఓపన్ అయిన వెంటనే పూర్వం నుండి ఎవ్వరెవ్వరి అనుభవంలో ఉన్నారో వారికే కేటాయిస్తామని ,పట్టాలు మార్చి ఇస్తామని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు చొరవ తీసుకొని పట్టాలు ఇప్పించాలని వారు కోరుతున్నారు.

## వైసిపి డాక్టర్ వింగ్ జిల్లా అధ్యక్షునిగా డాక్టర్ ప్రణీత్



**ఆత్మకూరు, డిసెంబర్20, ప్రభాతవార్త:** వైసిపి డాక్టర్స్ వింగ్ జిల్లా అధ్యక్షునిగా ఆత్మకూరు ఎస్.వి.ప్రజావైద్యశాల ఎం.డి వింజం దొరసానమ్మ చారిటబుల్ ట్రస్ట్ చైర్మెన్ డాక్టర్ ప్రణీత్ ఎంపికయ్యారు. శుక్రవారం పార్టీ ప్రకటించిన నూతన అధ్యక్షుల జాబితాలో ఆయన పేరును డాక్టర్ వింగ్ జిల్లా అధ్యక్షునిగా ప్రకటించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి వైసిపి డాక్టర్స వింగ్ అధ్యక్షునిగా ఎంపిక చేసిన రాష్ట్ర అధ్యక్షులు వైఎస్‌జగన్మోహన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఆత్మకూరు మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డిలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. వైసిపి ని మరింత బలోపేతం చేసేందుకు మరింత శ్రమిస్తానని ఈసందర్భంగా డాక్టర్ ప్రణీత్ పేర్కొన్నారు.

## వైసిపి నేత గయాజ్‌ను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే



**కావలి, డిసెంబర్20 ప్రభాతవార్త :** కావలి పట్టణ 9వ వార్డు వైసిపి నాయకుడు గయాజ్ ప్రమాదవశాత్తూ గాయపడి ఇంటివద్దే విశ్రాంతి తీసుకుంటున్న విషయాన్ని తెలుసుకుని వైసిపి కావలి నియోజకవర్గ ఇన్‌చార్జి మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి పరామర్శించారు. శుక్రవారం వైసిపి నేతలతో గయాజ్ నివాసానికి మాజీ ఎమ్మెల్యే వెళ్లారు. గయాజ్ ప్రమాదానికి గల కారణాలను ఆయన అడిగి తెలుసు కున్నారు. త్వరగా కోలుకోవాలని కోరారు. ఆయన వెంట మాజీ ఏఎంసి ఛైర్మన్ సన్నెబో యిన ప్రసాద్, షాహుల్ హమీద్, వైసిపి నేతలు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీనివాసరామానుజన్ జయంతి వేడుకలు



**కోవూరు, డిసెంబరు 20 ప్రభాతవార్త :** కోవూరులోని కోనమ్మతోటలో ఉన్న న్యాలిటిల్ ఫ్లవర్ ఆంగ్ల మాద్యమ పాఠశా లలో శ్రీ శ్రీనివాస రామానుజన్ జయ ంతి సందర్భంగా ముందస్తుగా శుక్రవారం మ్యాక్స్ ఎక్స్‌ఫ్లో 2024ను కోవూరు ఎస్సై రంగనాథ్ గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమా లు ఏర్పాటు చేయడం వలన ప్రాథమిక దశ నుంచి విద్యార్థుల్లో దాగి ఉన్న అనేక నైపుణ్యాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంటుందన్నారు. ఇదే స్ఫూర్తిని పాఠశాల కరస్పాండెంట్ వై. నందకిషోర్ , డైరెక్టర్ అనితలు ప్రత్యేకంగా చొరవ తీసుకుని ఇటువంటి మ్యాథ్స్ సదస్సులను ఏర్పాటు చేయడం ఇతరులకు స్ఫూర్తిదా యకమన్నారు. కోవూరు మండల స్పోర్ట్స్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు గాదిరాజు అశోక్‌కుమార్ మాట్లాడుతూ గత రెండు దశాబ్దాలకు పైగా ఈ పాఠశాల యాజమాన్యం ఇటువంటి వినూత్న కార్యక్రమాలకు శ్రీకారం చుడుతూ మండలంలో ప్రైవేట్ పాఠశాలల్లో ఒక ప్రత్యేకతను చాటుకుందన్నారు. ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం వలన విద్యార్థుల్లో ఉన్న ప్రతిభ మరింత సానబట్టేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు సూరిశెట్టి శ్రీనివాసులు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి. కోటయ్య, ఇన్‌చార్జి విజయలక్ష్మి, ఉపాధ్యాయులు ఉన్నారు.

## కోనలో వైభవంగా గోధాదేవి క్షేత్రోత్సవం




**పెంచలకోన(రాపూరు), డిసెంబరు20ప్రభాతవార్త :** ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలో ధనుర్మా సంలో తోలి శుక్రవారం సందర్భంగా శ్రీ ఆదిలక్ష్మీ అమ్మవారికి గోధా దేవి అలంకారంలో క్షేత్రోత్సవం వైభవంగా నిర్వహించారు. ఇందులో బాగంగా ఉదయం ఆలయంలో అమ్మవారికి తిరుప్పావై నిర్వ హించారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారిని పలు రకాలైన పుష్పాలతో శోభాయమానంగా ఆలంకరించి కోనలో క్షేత్రోత్సవం నిర్వహించారు. ఆలయఉప కమీషనర్ పోరెడ్డి శ్రీనివాసుల రెడ్డి, దేవాస్థానం ఎఇ వినోద్, ప్రధానార్చకులు రామయ్య స్వామి, పెంచలయ్య స్వామి, అర్చక స్వాములు శశి స్వామి, వినోధ్ స్వామి, వర్ధన్ స్వామి, నాగరాజు స్వామి, సాయి స్వామి, ఆలయ సిబ్బంది పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

## బిఆర్ అంబేద్కర్ పై అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ కాంగ్రెస్ నిరసన



**నెల్లూరు రూరల్, డిసెంబర్ 20, ప్రభాతవార్త :** భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ పై అత్యున్నత స్థానమైన పార్లమెంట్ సాక్షిగా అనుచిత వ్యాఖ్యాలు చేసిన కేంద్ర హోం మంత్రి అమిత్ షా తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని కాంగ్రెస్ నాయకులు సంజయ్ కుమార్ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ఇందిరా భవన్‌లో నెల్లూరు జిల్లా డిసిసి అధ్యక్షుడు చేవూరు దేవకుమార్ రెడ్డి పిలుపుమేరకు బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం ఎదుట నాయకులు నిరసన వ్యక్తం తెలిపారు. మీడియా ఇంచార్జ్ సంజయ్ కుమార్ మాట్లాడుతూ అంబేద్కర్ రచించిన రాజ్యాంగం పైనే అన్ని వ్యవస్థలు నడుపుతూ ఆయన గురించి మాట్లాడటం చాలా దారుణమన్నారు. ఆర్ఎస్ఎస్ భావజాలంతో నడుస్తున్నటువంటి బిజెపి అంబేద్కర్ పైన అమిత్ షా విలుబుచ్చిన విధానం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే జాతికి క్షమాపణ చెప్పి అమిత్ షా హోమ్ మినిస్టర్ పదవికి రాజీనామా చేయాలని ఏటూరి శ్రీనివాస్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మల్లికార్జున్ రెడ్డి, అల్లావుద్దీన్, మోహన్, శ్రీరాములు, యువజన కాంగ్రెస్ పప్పర్తి గణేష్, సేవాదళ్ సుజాత, సుధీర్, ఇర్ఫాన్, బద్రి, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులకు క్యారేజి బ్యాగులు బహుకరణ



**సీతారామపురం డిసెంబర్ 20 ప్రభాత వార్త :** ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ పెడరేషన్ ఆవిర్భవించి ఆగష్టు 10 నాటికి 50 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా స్వర్ణోత్సవ మహాసభలు జరుపుకోవడం జరిగింది. అలాగే సీతాంామపురం మం డలంలో స్వర్ణోత్సవ మహాసభలు నూతన కమీటి ద్వారాగా జరిగాయని ఈ సందర్భంగా సీతారామపురం మండల ప్రధాన కార్యదర్శి గొడ్ల వేటి వెంకటేశ్వర్లు మహాసభకు హాజరైన ఉపాధ్యాయులందరికి క్యారేజి బ్యాగులను బహుమతిగా ఇవ్వడం జరిగింది. అలాగే జిల్లా శాఖ కుటుంబ సంక్షేమ పథకం సభ్యులకు వాటర్ బాటిల్స్ ఇవ్వడం జరిగింది .సీతారామపురం యుటిఎఫ్ కార్యాలయం నందు ఆయా ఉపాధ్యాయులకు ఇవ్వడం జరిగిందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో అద్యక్ష ప్రధాన కార్యదర్శులు బోగ్యం శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి గొడ్ల వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శి తిరపతయ్య, గౌరవాధ్యక్షులు రంతుజానీ, సహాయధ్యక్షులు సురేష్, పిపిపి కుమారి, జిల్లా కౌన్సిలర్లు పి. శ్రీనివాసులు, యుటిఎఫ్‌నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మహిళా వ్యాపారవేత్తలు సద్వినియోగం చేసుకోవాలి



**కోవూరు, డిసెంబరు 20 ప్రభాతవార్త :** ప్రభుత్వం పొదుపు గ్రూపుల్లో ఉన్న మహిళా వ్యాపారవేత్తలను మరింత అభివృద్ధి పథంలోకి తీసుకువచ్చేందుకు ఒక ప్రత్యేక కార్యక్రమాన్ని రూపొందించిందని, ప్రతి గ్రూపులోని సభ్యులు ఇటువంటి మంచి అవకాశాన్ని పూర్తిస్థాయిలో ఉపయోగించుకోవాలని ఏపీఎం సుబ్బరాజు అన్నారు. కోవూరులోని సంఘమిత్ర కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ కోవూరు మండలంలోని మొత్తం పొదుపు గ్రూపుల్లో 230 మందిని మహిళా వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక దృష్టి సారించడం జరిగిందన్నారు. ఈ పథకం కింద రూ. లక్ష నుంచి వారు పెట్టే పరిశ్రమ ఆధారంగా బ్యాంకుల ద్వారా రుణాలు అందించడం జరుగుతుందన్నారు. ఇందుకు వారు పాన్‌కార్డు, ఆధార్ కార్డు, ఉద్యమ్ ఆధార్, లేబర్ సర్టిఫికేట్‌లను దరఖాస్తుతో పాటు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. వచ్చే దరఖాస్తులను పరిశీలించి వారికి బ్యాంకుల ద్వారా రుణం మంజూరు చేయడం జరుగుతుందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని పొదుపు గ్రూపులోని మహిళలు మహిళా వ్యాపారవేత్తలుగా మారేందుకు ఈ అవకాశాన్ని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇప్పటివరకు మండలంలో ఈ పథకం కింద 32 మందికి బ్యాంకుల ద్వారా రుణాలు మంజూరు చేయడం జరిగిందన్నారు.

## రమాదేవి ఆధ్వర్యంలో ముందస్తు ప్రీ క్రిస్మస్ వేడుకలు



**నెల్లూరు, డిసెంబర్ 20, ప్రభాతవార్త-వైద్యం :** నగరంలోని గోమతి నగర్‌లో ఉన్న మంత్రి నారాయణ క్యాంపు కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని ప్రీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రి పొంగూరు నారాయణ సతీమణి పొంగూరు రమాదేవి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె క్రైస్తవ సోదరీమణులు, చిన్నారులు, 28వ డివిజన్ల టీడీపీ మహిళా నాయకురాళ్లతో కలిసి కేక్ కట్ చేసి అందరికి పంచిపెట్టి ముందస్తు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. చిన్నారులు ప్రదర్శించిన నాటికలు, నృత్యాలు ఆకట్టుకున్నాయి. అనంతరం రమాదేవి మాట్లాడుతూ సమాజంలో అసమానతలు ఉన్నాయని, వాటి పరిష్కారానికి బైబిల్ మార్గం చూపించిందన్నారు. సమానత, శాంతి కోసం ఏసుక్రీస్తు జీవితాంతం శ్రమించారని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ తాళ్ళపాక అనురాధతో పాటు మాజీ జడ్పీటీసీ విజేతరెడ్డి, కప్పిర రేవతి, గుణుకుల విజయలక్ష్మి, జనసేన మహిళలు నాయకురాళ్ల తదితరులు పాల్గొన్నారు.

## కాకర్ల సంహిత్ ఉదయగిరిలో విస్తృత పర్యటన



**ఉదయగిరి, డిసెంబర్ 20, ప్రభాతవార్త :** ఉదయగిరి మండలంలో శాసనసభ్యులు కాకర్ల సురేషన తనయుడు కాకర్ల సంహిత్ శుక్రవారం విస్తృత పర్యటన చేశారు. పలు కుటుంబాలను నేరుగా పరామర్శించారు. ఉదయగిరి పట్టణానికి చెందిన మాజీ సర్పంచ్ ఎస్‌కే రియాజ్ సమీప బంధువు ఎస్‌కే యస్థని అమెరికాలో గత ఏడు నెలల క్రితం చనిపోగా వారి కుటుంబాన్ని పరామర్శించారు. వారి బిడ్డలకు అండగా ఉంటామని తెలిపారు. అదేవిధంగా ఉదయగిరి మండలం ఆర్లపడియ పంచాయతీ కొటాయపల్లి గ్రామానికి చెందిన జొన్నలగడ్డ నారాయణ కుటుంబాన్ని పరామర్శించారు. నారాయణకు పెళ్లయిన వారం లోపలే ప్రమాదంలో కాలు విరిగి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపధ్యంలో వారి కుటుంబాన్ని ఆదుకుంటామని తెలిపారు. వారికి ఉపాధి అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఉదయగిరిలోని ఎస్టీ కాలనీ ప్రజలతో మాట్లాడారు. ఎన్నికలకు ముందు కాలనీ అభివృద్ధికి హామీ ఇచ్చి ఉన్నాని తొందరలోనే సమస్యల పరిష్కారానికి శ్రీకారం చుడతానని తాగునీరు సిమెంటు రోడ్లు విద్యుత్ స్తంభాలు యువతకు ఉపాధి అవకాశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తానని కాలనీ వాసులకు మామీ ఇచ్చారు. ఈ కార్యక్రమలో ఆయన వెంట ఉదయగిరి మండల కన్వీనర్ చితనబోయిన బయన్న, మైనార్టీ నాయకులు షేక్ రియాజ్, శివకృష్ణ, ఆర్లపడియ టీడీపీ నాయకులు కృష్ణారెడ్డి, తమ్మినేని మనో ప్రకాష్; తుమ్మల కిరణ్, ఇమ్రాన్, సంధాని, ఆలూరి అంకయ్య, సురేష్, రామలక్ష్మణులు, గాజుల బాబు తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర హోమ్‌మంత్రి అమిత్‌షాకు అంబేద్కర్ అంటే ఎందుకంత భయం



**ఉలవపాడు, డిసెంబర్ 20, ప్రభాతవార్త :** రాజ్యాంగాన్ని రచించినటువంటి గొప్ప వ్యక్తి డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ అంటే కేంద్ర హోం మంత్రి అమిత్‌షా కి ఎందుకంత భయం అని 139 బీసీ కులాల జేఏసీ రాష్ట్ర చైర్మన్ మిరియం శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర హోమ్ మంత్రి పార్లమెంట్లో అంబేద్కర్‌ని అవమానపరిచే విధంగా మాట్లాడటం ఏమిటని ప్రశ్నించారు. ఆర్ఎస్ఎస్ కనుసన్నల్లో నడుస్తున్న బీజేపీ పార్టీ మొదటి నుండి కూడా అంబేద్కర్ పై అనుచిత వ్యాఖ్యలు చేస్తూనే ఉన్నారు. దీనంతటికి కారణం రిజర్వేషన్లు ఎత్తి వేయాలని రాజ్యాంగాన్ని మార్చి వేయాలనేటువంటి కుట్రతో వ్యవహరిస్తున్న బీజేపీ తీరును భారతదేశంలో ఉన్న ప్రజలందరూ గమనిస్తున్నారని తెలిపారు. వెంటనే అమిత్ షా తన పదవికి రాజీనామా చేయాలని శ్రీనివాసులు డిమాండ్ చేశారు.

## శానిటేషన్ మస్టర్ కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేసిన చైర్‌పర్సన్



**బుచ్చి డిసెంబర్ 20 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెం పట్టణంలో పారిశుద్ధ్యం పై ప్రత్యేక దృష్టి సారించినట్లు చైర్‌పర్సన్ మోర్ల సుప్రజా మురళీ తెలిపారు. శానిటేషన్ మస్టర్ కేంద్రాన్ని ఆమె ఆకస్మిక తనిఖీ చేసిన సందర్భంగా మాట్లాడుతు రోడ్లపైన చెత్త వేయకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. క్రిస్మస్ పండుగ వస్తుందని చర్చిలన్నింటి వద్ద పారిశుద్ధ్యం పటిష్టంగా ఉండే విధంగా పారిశుద్ధ్య కార్మికులు పనిచేయాలని సూచించారు. నగరపాలక పంచాయితీ అబివృద్ధికి కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్ని విధాలా పూర్తి స్థాయిలో సహకారం అందిస్తుందని అన్నారు. బుచ్చిరెడ్డిపాళెం నగర పాలక పంచాయితీలో పారిశుద్ధ్యం పూర్తి స్థాయిలో మెరుగు పరిచేందుకు తీసుకోవల్సిన చర్యలుగురించిఆమె చర్చించారు. మున్సి ఫల్‌సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులున్నారు.

## బిసి బాలికల వసతి గృహాన్ని సందర్శించిన జిల్లా బిసి అధికారిణి



**సంగం డిసెంబర్ 20 ప్రభాతవార్త** మండలకేంద్రమైన సంగంలోని బిసి బాలికల వసతి గృహాన్ని జిల్లా బిసి వెల్ఫేర్ అధికారిణి ప్రసన్న పరిశీలించారు. హాస్టల్ గదులను, వంటగదిని అన్నింటిని ఆమె పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. వసతి గృహ అధికారిణి ఎం.మల్లేశ్వర్వమ్మను పదోతరగతి విద్యార్థుల ఉత్తీర్ణతా శాతం గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. గత సంవత్సరాల ఉత్తీర్ణతశాతం పరిశీలించిన ఆమె సంక్షేమ అధికారిణి మల్లేశ్వరమ్మను అభినందించారు. కొద్ది సేపు విద్యార్థులతో వసతిగృహంలో సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. త్వరలో జరగనున్న పదో తరగతి పరీక్షలలో మంచి ఫలితాలు తీసుకొని రావాలని ఆమె విద్యార్థులకు సూచించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతు జిల్లా వ్యాప్తంగా పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు తీసుకొని వచ్చేందుకు పూర్తిస్థాయిలో కృషి చేస్తున్నట్లు ఆమె తెలిపారు. బిసి హాస్టల్స్ విద్యా రులు ఎప్పుడు మంచి ఫలితాలు సాధిస్తారని ఆమె ప్రశంసించారు. ఈకార్యక్రమంలో ఆమె వెంట సిబ్బంది ఉన్నారు.

## కావలి డీఎస్పీ పి శ్రీధర్‌ను సత్కరించిన మాలేపాటి



**కావలి, డిసెంబర్20 ప్రభాతవార్త** కావలి డీఎస్పీ పి.శ్రీధర్‌ను డీఎస్పీ కార్యాల యంలో శుక్రవారం టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు కావలి నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జి మాలేపాటి సుబ్బానాయుడు మర్యాదపూర్వకంగాకలిశారు. ఆయనను దుశ్శాలు వాతో సత్కరించిఅభినందనలు తెలి పారు. మాలేపాటి వెంట టిడిపి జిల్లాఉపాధ్యక్షుడు మన్నవ రవిచంద్ర, తదితర టిడిపినేతలు పాల్గొన్నారు.

**-కావలి ఆర్డీఓ వంశీకృష్ణను కలిసిన మాలేపాటి...** కావలి ఆర్డీఓ వంశీకృష్ణను ఆర్డీఓ కార్యాలయంలో శుక్రవారం టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు, టిడిపి కావలి నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జి మాలేపాటి సుబ్బానాయుడు మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనను దుశ్శాలువాతోసత్కరించి శుభాకాంక్షలుతెలిపారు. అనంతరం ఆర్డీఓతో కొంతసేపు ముచ్చటించారు. ఆయనతోపాటు టిడిపినేతలు పాల్గొన్నారు.

## వెలినేని శ్రీనివాసులునాయుడును పరామర్శించిన ప్రతాప్‌రెడ్డి



**కావలి, డిసెంబర్20 ప్రభాతవార్త** దగదర్తి మండలం మాజీ యువత అధ్యక్షులు వెలినేని మహేష్‌నాయుడు తండ్రి శ్రీనివాసులు అనారోగ్యంతో నెల్లూరులోని ఉమామహేష్ న్యూరోసెంటర్ వైద్యశాలలో చికిత్స పొందుతున్నారన్న విషయం తెలుసుకుని వైసిపి కావలి నియోజకవర్గ ఇన్‌చార్జి మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి పరామర్శించారు. ఆయన వెంట వైసిపి పట్టణ అధ్యక్షుడు కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి, వైసిపి నేతలు కనమర్లపూడి వెంకటనారాయణ, చెన్ను ప్రసాదరెడ్డి, దామిశెట్టి సుధీర్‌నాయుడు, అయ్యవారు కృష్ణారెడ్డి, తదితర వైసిపి నేతలు పాల్గొన్నారు.

## శ్రీ గంగాభవాని సన్నిధిలో ఎమ్మెల్యే కాకర్ల



వింజమూరు, డిసెంబర్20, ప్రభాతవార్త: వింజమూరులోని గంగమిట్టలో వేంచేసియున్న శ్రీ గంగాభవాని అమ్మవారి తిరునాల సందర్భంగా శుక్రవారం ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ స్థానిక తెలుగుదేశంపార్టీ నేతలతో కలిసి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ఎమ్మెల్యేకు అపూర్వ స్వాగతం పలికారు. అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ విశిష్టతను, అమ్మవారి గొప్పతనాన్ని వివరించారు. ఆలయాన్ని సర్వాంగసుందరంగా నిర్మించారని, అమ్మవారు ప్రశాంతవదనంతో అలరారుతున్నారన్నారు. అనంతరం ముస్లిం మైనార్టీ సీనియర్ నాయకులు షేక్ ఖాజావలి నివాసానికి వెళ్ళి తేనీటివిందును స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ గొంగటి రఘునాథరెడ్డి, టిడిపి జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి చల్లా వెంకటేశ్వర్లు , బిజెపి నాయకులు దేగా మధు యాదవ్, మాజీ మండల కన్వీనర్ గూడా నరసారెడ్డి, రమణయ్య, పాములపాటి మాల్యాద్రి, మంచాల శ్రీనివాసులునాయుడు, తిరుపతాచారి , కలిగిరి సిఐ వెంకటరమణ, స్థానిక ఎస్ఐ వీరప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

## భూ ఆక్రమణలపై చర్యలు తీసుకొండి : సబ్ కలెక్టర్ శ్రీ పూజ



**వరికుంటపాడు, డిసెంబర్ 20, ప్రభాతవార్త :** భూ అక్రమణలకు పాల్పడిన వారికి నోటీసులు అందజేసి, ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకోవాలని కందుకూరు సబ్ కలెక్టర్ శ్రీ పూజ మండల రెవిన్యూ అధికారును ఆదేశించారు. శుక్రవారం మండలంలోని గణేశ్వరాపురం గ్రామంలో మేత పోరంబోకు భూమిని ఆక్రమణ పై వచ్చిన ఫిర్యాదు మేరకు సబ్ కలెక్టర్ శ్రీ పూజ ఆ భూములను పరిశీ లించారు. అక్కడ భూముల్లో ఉన్న చెట్లను తొలగిస్తున్న వారిని ప్రశ్నించగా తాము ఎస్సీ, ఎస్టీలమని తమకు ఎలాంటి భూమి లేదని, అందుకనే ఈ భూమిని సాగు చేసుకొని జీవనం సాగించేందుకు బాగు చేస్తున్నామని, ఇదే విషయం ను ఉదయగిరి ఎమ్మెల్యేకు కూడా అర్జీలు సమర్పించామని తెలిపారు. ప్రభుత్వ భూమిని ఆక్రమించకూడదు అని సబ్ కలెక్టర్ అనగా మా గ్రామంలో అనేక మంది వందలాది ఎకరాల ప్రభుత్వ భూమిని ఆక్రమించుకున్నారని వారికి లేని చట్టం మాకు మాత్రమే వర్తిస్తుందా అనిఎస్సీ, ఎస్టీలు ఆమెను ప్రశ్నించారు. స్పం దించిన సబ్ కలెక్టర్ గ్రామంలో ప్రభుత్వ భూమిని ఆక్రమించిన వారందరికి నోటీసులు ఇచ్చి ఆ భూములను స్వాధీనం చేసుకోవాలని తహశీల్దార్ ను ఆదేశించారు.

**మాగ్రామంలో మైనింగ్ కు అనుమతులు ఇవ్వవద్దు :** మండలంలో శుక్రవారం పర్యటించిన సబ్ కలెక్టర్ శ్రీ పూజ వరికుంటపాడు సచివాలయం వద్ద జరుగుతున్న రెవిన్యూ గ్రామ సదస్సులో పాల్గొని అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా వరికుంటపాడు పంచాయతీలోని జంగంరెడ్డిపల్లి గ్రామస్తులు తమ గ్రామ సమీపాన అక్రమంగా మైనింగ్ తవ్వకాలు చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారనీ, దీని వలన తమ జీవన స్థితి గతులు మారుతాయని కాబట్టి అక్కడ మైనింగ్ తవ్వకాలకు అనుమతులు ఇవ్వవద్దని సబ్ కలెక్టర్ కోరారు. ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం అక్కడ మైనింగ్ జరగాలంటే గ్రామ సభ పెట్టి ప్రజల అభిష్టం మేరకు అనుమతులు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమములో తహశీల్దార్ పసుపులేటి హేమంత్ కుమార్, డిప్యూటి తహశీల్దార్ చెంచయ్య, వరికుంటపాడు సర్పంచ్ కొండెపోగు దిలీప్ కుమార్ , కార్యాలయ సీనియర్ సహాయకులు శ్రీనివాసులు, విఆర్‌ఓలు ఆంతోని బాబు, ప్రసాద్ , సర్వేయర్ జాషువ, నాయబ్ రైతులు తదితరులు పాల్గొన్నారు.

## రైతన్నలకు అండగా ప్రభుత్వం
### కన్వీనర్ చంద్ర మధుసూధన్‌రావు



వరికుంటపాడు, డిసెంబర్ 20, ప్రభాతవార్త : రైతన్నల కష్టాలను ఎప్పటి కప్పుడు పరిష్కరిస్తు వారికి అండగా కూటమి ప్రభుత్వం నిలుస్తుందని టిడిపి మండల కన్వీనర్ చంద్ర మధుసూధన్‌రావు అన్నారు. శుక్రవారం మండలంలోని విరువూరు గ్రామంలో మండల వ్యవసాయాధికారి రవికుమార్, గ్రామ వ్యవసాయ సహాయకురాలు శారదా ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమములో తుఫాన్ ప్రభావంతో శనగ పంటను సాగు చేస్తూ విత్తన దశలోనే నష్టపోయిన రైతులకు 80 శాతం సబ్సిడితో ప్రభుత్వం అందజేసిన శనగలను మండల కన్వీనర్ చంద్ర మధుసూధన్‌రావు రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా చంద్ర మధుసూధన్‌రావు మాట్లాడుతూ నష్ట పోయిన ప్రతి రైతుకు సబ్సిడిపై 9,400 విలువ చేసే క్వింటా శనగలను ప్రభుత్వం 80 శాతం సబ్సిడితో 1800 రూపాలయకే అందజేస్తూ ప్రభుత్వం రైతు సంక్షేమానికి కృషి చేసిందని కొనియాడారు. ఈ కార్యక్రమములో మండల తెలుగుయువత అధ్యక్షుడు ముజ్జే లక్ష్మినారాయణ, కృష్ణంరాజుపల్లి సర్పంచ్ వెంకటనారాయణ, నాయకులు ఆలేటి భానుకుమార్, హజర త్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, వ్యవసాయ సహాయకులు ఆదిత్య, చంద్రశేఖర్, పవన్, శ్రీకాంత్ రైతులు తదితరులు పాల్గొన్నారు.

## రేషన్ బియ్యం.. మాఫియాకి ఉపయోగం



**నెల్లూరు, డిసెంబర్ 20, ప్రభాతవార్త-వైద్యం** పేదల ఆకలి తీర్చేందుకు ప్రభుత్వం పంపిణీ చేస్తున్న రేషన్ బియ్యం పథకం, పేదల కంటే రేషన్ మాఫియాకే ఎక్కువ ఉపయోగపడు తుందని జిల్లా ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డి అన్నారు. శుక్రవారం నగరంలోని టీడీపీ జిల్లా కేంద్ర కార్యాలయంలో వెంకటేశ్వర్లురెడ్డి విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోని మొదటి సారిగా స్వర్గీయ నందమూరి తారక రామారావు, రెండు రూపాయలకు కేజీ బియ్యం పథకాన్ని మన రాష్ట్రంలో 1983లో ప్రవేశపెట్టారన్నారు. 1992 నుండి కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా దేశ వ్యాప్తంగా బియ్యం అందిస్తుందన్నారు. పేదల ఆకలి తీర్చేందుకు ఈ పథకం ద్వారా బియ్యం పంపిణీ కొరకు ఏడాదికి కేంద్ర ప్రభుత్వం లక్ష కోట్లకు పైగా, రాష్ట్ర ప్రభుత్వం వేల కోట్లు ఖర్చు చేస్తుందని, పేదల ఆకలి తీర్చేందుకై ప్రభుత్వం పంపిణీ చేస్తున్న రేషన్ బియ్యం పథకం, పేదల కంటే రేషన్ మాఫియాకే ఎక్కువ ఉపయోగపడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పథకం కింద కేజీ బియ్యానికి ప్రభుత్వం రూ.43 ఖర్చు చేస్తుంటే, దానిలో పేదలకు రూ.10 లు చెందుతుంటే రేషన్ మాఫియాకు రూ.33 జేబుల్లోకి చేరుతున్నాయన్నారు. రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో రేషన్ బియ్యం మాఫియా విజృంభించింది. వైసీపీ అయిదు సంవత్సరాల కాలంలో దాదాపు 1.30 కోట్ల టన్నుల రేషన్ బియ్యం దేశం దాటి విదేశాలకు వెళ్లిందని ఆయన తెలిపారు. పేదలకు చెందాల్సిన వేల కోట్ల రూపాయలు మాఫియా జేబుల్లోకి వెళ్తున్న ఈ పథకంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధ్యయనం చేసి, ఈ పథకంలో మార్పులను చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. రేషన్ కార్డు దారులకు ఆప్షన్ ఇచ్చి బియ్యం కావాలనే వారికి బియ్యం ఇచ్చి, బియ్యం వద్దు అన్న వారికి కేజీ రూ.43 లు నగదు బదిలీ చేసే అంశాన్ని కూడా ప్రభుత్వాలు పరిశీలించాలన్నారు. ఏడాదికి కేంద్ర ప్రభుత్వం లక్ష కోట్లకు పైగా ఖర్చు చేస్తున్న ఈ పథకం నిజమైన లబ్దిదారులకు ఉపయోగపడే విధంగా అక్రమాలకు తావు లేకుండా ఉండే విధంగా కొత్త చట్టాలను రూపొందించాలని కేంద్ర ప్రభుత్వంకి చేజర్ల విజ్ఞప్తి చేశారు.

## పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన డిఎస్పి



**నెల్లూరు క్రైమ్, డిసెంబర్ 20, ప్రభాతవార్త :** చిన్న బజార్ పోలీస్ స్టేషన్‌ను నగర డి.ఎస్.పి శ్రీనివాసరెడ్డి శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్ పరిధిలో నేరాల నియంత్రణకు, శాంతి భద్రతల పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై స్టేషన్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. రికార్డులను తనిఖీ చేసి పెండింగ్ కేసులను సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ వెంట సీఐ సిహెచ్ కోటేశ్వరరావు ఇతర సిబ్బంది ఉన్నారు.

## విద్యార్థులలో సృజనాత్మకతను వెలికితీత



**సైదాపురం(చిల్లకూరు), డిసెంబర్ 20, ప్రభాతవార్త** విద్యార్థులలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు మండల కేంద్రమైన చిల్లకూరులో ఉన్న లిటిల్ ఏంజెల్స్ పబ్లిక్ స్కూల్ నందు 1వ తరగతి నుండి 8వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థినీ, విద్యార్థులకు సైన్స్, సోషల్ పాఠ్యాంశాలకు సంబంధించి శుక్రవారం ఎక్స్‌పో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినీ, విద్యార్థులు వారి పాఠ్యాంశాలకు సంబంధించి వివిధ అంశాలను బొమ్మల రూపంలో రూపొందించారు. 4వ తరగతి చదువుతున్న షోడవరం అశ్రీత్ ఆరోన్ అనే విద్యార్థి ప్రకృతి సిద్ధంగా సూర్యరశ్మి ద్వారా వచ్చే విద్యుత్ వినియోగం నమూనాను రూపొందించారు. ఈ నమూనా ఎంతగానో ఆకట్టుకుంది. దీంతో ఉపాధ్యాయుల బృందం విద్యార్థి రూపొందించిన నమూనాను చూసి అభినందించారు. విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## కబ్జా చేసిన ప్రభుత్వ భూములు స్వాధీనం చేసుకుంటాం ఎమ్మెల్యే



**రాపూరు, డిసెంబరు20ప్రభాతవార్త** గత ప్రభుత్వంలో వైసిపి నాయకులు దౌర్జన్యంగా ఆక్రమించుకున్న ప్రభుత్వ భూములను సర్వే చేసి స్వాధీనం చేసుకొంటామని వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. శుక్రవారం తానంచర్లలోని చెన్ను గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన విలేఖర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాపూరు మండలంలోని సంక్రాంతిపల్లి పంచాయితీ పరిధిలో ఒక వైసిపి నాయకుడు గత ప్రభుత్వంలో సుమారు 100 ఎకరాల పైచిలుకు భూమిని ఆక్రమించాడన్నారు. దీంతో పాటు రైతులకు నీరు వెళ్లే పిన్నేరు వాగును సైతం ఆక్రమించి తన తోటలో కలుపుకున్నాడన్నారు. ఈ ప్రభుత్వ భూములు అక్రమణపై రెవెన్యూ అధికారులు స్పందించి ఆ భూములకు సర్వే చేసి కొంత మేర తొలగించారని, మిగిలిన భూములకు, పిన్నేరు వాగుకు సర్వే నిర్వహించి ఆక్రమతి ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకొని, భూమి లేని పేదలకు ఆ భూమిని పంపిణీ చేస్తామని ఆయన తెలిపారు. ఈ భూములతో పాటు మండలంలో పలువురు వైసిపి నాయకులు ప్రభుత్వ భూములు ఆక్రమించి వున్నారని వాటి అన్నింటికి సర్వే నిర్వహించి వాటిని స్వాధీనం చేసుకొని నిరుపేదలకు పంపిణీ చేస్తామని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో పెంచలకోన దేవస్థానం మాజీ ఛైర్మన్ చెన్ను తిరిపాల్ రెడ్డి, రాపూరు సొసైటీ మాజీ అధ్యక్షుడు చెన్ను బాస్కర రెడ్డి, టిడిపి మండల పార్టీ అధ్యక్షుడు దందోలు వెంకటేశ్వర రెడ్డి, తిరుపతి పార్లమెంట్ అధికార ప్రతినిధి నువ్వుల శివరామకృష్ణ, నాయకులు నల్లవడ్ల వెంకటరమణా రెడ్డి, కూనిపోగు కన్నయ్య, పెద్ద ఎత్తున తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు వున్నారు.

## వీర్ బాల్ దివాస్‌ఖిను ఘనంగా నిర్వహించండి



**నెల్లూరు డిసెంబర్ 20, ప్రభాతవార్తవైద్యం** 21 నుండి 26 తేది వరకు జరగనున్న వీరు బాల్ దివాస్ ని ప్రతి పాఠశాలలో ఘనంగా నిర్వహించాలని, డీఈఓ కార్యాలయంలో డీఈవో బాలాజీ రావు కి భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యదర్శి కందికట్ల రాజేశ్వరి, జిల్లా కార్యదర్శి చిలక ప్రవీణ్ కుమార్, గుప్త అశోక్ నాయుడులు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాల్యంలోనే దేశం కోసం ధర్మం కోసం తమ ప్రాణాలను సైతం తృణప్రాయంగా త్యాగం చేసిన బాబా జోరావర్ సింగ్, బాబా ఫతేసింగ్ లు నేటి విద్యార్థులకు ఆదర్శంగా తీసుకోవాలని ఈ అంశాన్ని పాఠశాలల్లోని ఉపాధ్యాయులు ,అధ్యాపకులు విద్యార్థులకు తెలియజేయాలన్నారు. ఈనెల 21తేది నుంచీ 26న వరకు జరిగే ఖీవీర్ బాల్ దివాస్ ఖిను జిల్లాలోని అన్ని పాఠశాల యందు భారత ప్రభుత్వం బాల్ వీర్ దివాస్ కి చెందిన గెజిట్ పత్రాన్ని ఆయనకు అందించారు. జిల్లాలోని అన్ని పాఠశాల్లాలదు విద్యార్థినీ విద్యార్థులకుఖీ వీర్ బాల్ దివాస్ ఖీ త్యాగస్ఫూర్తిని అర్థమయ్యేలా విద్యార్థిని విద్యార్థులకు వివరించాలన్నారు. ఈ వేడుకలను భారత ప్రధాని నరేంద్ర మోడీ అత్యంత ఘనంగా నిర్వహించేందుకు సన్నద్ధమయ్యారని వారు పేర్కొన్నారు .

## సకాలంలో టీకాలు వేయండి



**నెల్లూరు, డిసెంబర్ 20, ప్రభాతవార్త-వైద్యం :** రోగాల నుంచి రక్షించడానికి పుట్టిన ప్రతి బిడ్డకు సకాలంలో టీకాలను క్రమం తప్పకుండా వేయండని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ మల్లి పెంచలయ్య మెడికల్ ఆఫీసర్లను ఆదేశించారు. శుక్రవారం నగరంలోని సంతపేటలో ఉన్న జిల్లా వైద్య శాఖ కార్యాలయంలో టీకాలపై జరిగిన సమీక్షా సమావేశంలో డీఎంహెచ్ఓ మాట్లాడారు. టీకాలు వేయించిన వారిలో వేలల్లో ఒక్కరికి ఏఈఎస్ఐ అనే ప్రతికూల సంఘటనలు జరగవచ్చన్నారు. అరుదుగా టీకాల అనంతరం జ్వరం, టీకా చేసిన చోట నొప్పి, వాపు రావచ్చన్నారు. అయితే ఇవి మందులు వాడకుండా రెండు, మూడు రోజులలో అవే తగ్గిపోతాయన్నారు. అయితే లక్ష మందిలో ఒకరిద్దరికి వాపు, నొప్పి తగ్గదన్నారు. నిర్లక్ష్యం చేస్తే ప్రాణాంతకం కావచ్చన్నారు. ఇలాంటి వారికి ఆసుపత్రిలో చేర్చి మందులు వాడాల్సి వస్తుందన్నారు. టీకాల వల్ల ఇలా ఏఈఎస్ఐ అనే సంఘటనకు గురైన వారు ఎవరైనా ఉంటే అలాంటి వారి గురించి 24 గంటలలోపు దీఐఓ కి తెలియజేయాలని , ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల యాజమాన్యాలకు సూచించారు. జీజీహెచ్ నారాయణ ఆసుపత్రిలో ప్రతి రోజు పుట్టిన పిల్లలకు 24 గంటల లోపు జీరో డోస్ వ్యాక్సిన్లు వేసేలా ఏర్పాట్లు చేశామన్నారు. అలాగే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో సైతం జీరో డోస్ వ్యాక్సిన్లు వేసేందుకు అన్ని రకాల చర్యలు తీసుకోవాలని మెడికల్ ఆఫీసర్లను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ ఉమామహేశ్వరి, ప్రపంచ ఆరోగ్య సంస్థ పోలియో సర్వేలైన్స్ అధికారి డాక్టర్ మౌనిక, ప్రభుత్వ మెడికల్ కళాశాల మైక్రోబయాలజి అసోసియేట్ ప్రొఫెసర్ వా.అనీల, పెదాలజిస్టు కృష్ణమూర్తి, జీజీ హెచ్ పీడియాట్రిషియన్ చిరంజీవి, జిల్లా ఫోక్సి అధ్యక్షురాలు డాక్టర్ యశోవర్, ఐఎంఎ డాక్టర్ అమరేంద్ర నాథ్‌రెడ్డి, డెమో అధికారి కనకరత్నం, స్టాటిస్టికల్ ఆఫీసర్ సహన, కోల్డ్ చైల్డ్ ఆఫీసర్ యుగంధర్‌లు పాల్గొన్నారు.




## టీడీపీలో చేరిన ముత్తుకూరు వైసీపీ నేతలు



**నెల్లూరు, డిసెంబర్20, ప్రభాతవార్త-వైద్యం** వైసీపీ సీనియర్ నాయకులు కాకుటూరు లక్ష్మణరెడ్డి, ముత్తుకూరు ఉప సర్పంచ్ కాకుటూరు అనితారెడ్డి, వార్డు సభ్యులు కావలి సుజాత, రొయ్యల శకుంతల, షేక్ ఆస్మాఓ పాటు కాకుటూరు విజయమోహన్‌రెడ్డి, రవిదేవారెడ్డి, కిషోర్, పాముల నాగరాజు, వెల్లంపల్లి సూరిబాబు, సురేష్, తిరుపతి రావు, కృష్ణయ్య గౌడ్ తదితరులు నగరంలోని వేదాయపాలెంలో ఉన్న తెలుగుదేశం పార్టీ జాతీయ పొలిట్ బ్యూరో సభ్యులు, మాజీ మంత్రి, మాజీ శాసన మండలి సభ్యుడు, సర్వేపల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి కార్యాలయంలో సోమిరెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా వారికి పార్టీ కండువాలను కప్పి సాధారణంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా రెడ్డి మాట్లాడుతూ సంక్షేమం చూసి పలువురు టీడీపీలో చేరుతున్నారన్నారు.

## అర్జీలకు తగు పరిష్కారం చూపడం జరుగుతుంది



**కోవూరు, డిసెంబరు 20 ప్రభాతవార్త :** ప్రతి గ్రామంలో నిర్వహించే రెవెన్యూ సదస్సుల్లో వచ్చే అర్జీలను నిశితంగా పరిశీలించి వాటికి తగు పరిష్కారం చూపేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తహసీల్దార్ నిర్మలానందబాబా తెలిపారు. కోవూరు మండలం పడుగుపాడు -2 సచివాలయం పరిధిలో శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లోని రైతులు తమ భూములకు సంబంధించి రెవెన్యూ సమస్యలు ఉంటే వాటిని లిఖిత రూపంగా ఈ సదస్సులో అందజేస్తే వాటిని పరిశీలించి సంబంధిత రైతుకు తగు పరిష్కారం చూపేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాకేష్, మండల సర్వేయర్ రమేష్ గౌడ్, గ్రామ రెవెన్యూ అధికారులు, రైతులు ఉన్నారు.

## పీఎం సూర్యఘర్ బిజిలీ యోజన పథకం సద్వినియోగం చేసుకోవాలి



**కోవూరు, డిసెంబరు 20 ప్రభాతవార్త :** కోవూరు మండలంలోని ఇనమడుగు గ్రామంలో శుక్రవారం ఎస్సీ , ఎస్టీ విద్యుత్ వినియోగదారులకు ప్రధనమంత్రి సూర్యఘర్ బిజిలీ యోజన పథకంపై అవగాహన కల్పించే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ట్రాన్స్‌కో డీఈ మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ సోలార్ పథకంను సంబంధిత విద్యుత్ వినియోగదారులు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇటువంటి మంచి పథకాన్ని ప్రభుత్వం రూపొందించిందని , దీనిని వారు పూర్తిస్థాయిలో ఉపయోగించుకుని విద్యుత్ ఆదాను చేయవచ్చని, తద్వారా వారికి ఆర్థికాభివృద్ధి కూడా కలుగుతుందని ఈ సందర్భంగా ఆయన తెలియజేశారు. ఈ పథకం ద్వారా గృహ వినియోగదారులు 1 కిలో వాట్ సోలార్ ప్యానల్ పెట్టుకుంటే అందుకు ప్రభుత్వం 30 వేలు, 2 కిలో వాట్ పెట్టుకుంటే 60 వేలు, 3 కిలో వాట్ ఆపైన పెట్టుకుంటే 78 వేలు ప్రభుత్వం సబ్సిడీగా అందిస్తుందన్నారు. ఈ సోలార్ ప్లాంట్‌ను ఇంటి పైకప్పుపై ఏర్పాటు చేసుకుంటే ప్రభుత్వ సబ్సిడీతో పాటు విద్యుత్ బిల్లులు కూడా చాలావరకు ఆదా అయ్యే పరిస్థితి ఉంటుందన్నారు. దీంతో పాటు పెట్టుబడిపై 25 నుంచి 30 శాతం వరకు రిటర్న్ వస్తుందన్నారు. ఈ సోలార్ విద్యుత్ ఏర్పాటు చేసుకుంటే వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందుతుందన్నారు. ఈకార్యక్రమంలో ట్రాన్స్‌కో ఏఈ రమేష్, విద్యుత్ సిబ్బంది ఉన్నారు.

## కలెక్టరేట్‌లో కారుణ్య నియామకాలు



**నెల్లూరు అర్బన్, డిసెంబర్ 20, ప్రభాతవార్త :** జిల్లాలోని పలు రాష్ట్ర ప్రభుత్వ శాఖలలో పనిచేస్తూ మరణించిన ఉద్యోగుల వారసులకు కారుణ్య నియామకాలు కింద ఉద్యోగాలు ఇచ్చారు. ఇందులో భాగంగా మొత్తం ఏడు మందికి ఉద్యోగాలు ఇవ్వగా అందులో ఒకరికి మినహా మిగిలిన ఆరో మందికి గ్రామ వార్డు సచివాలయాలలో పోస్టింగ్ ఇచ్చారు. కె. శిరీష జూనియర్ అసిస్టెంట్గా నెల్లూరులోని సూపరెండెంట్ ఇంజనీర్. పంచాయతీరాజ్ సర్కిల్‌లో పోసింగ్ ఇవ్వగా మిగిలిన వారికి గ్రామ వార్డు సచివాలయాలలో పోస్టింగు ఇచ్చారు. ఎస్. జయకృష్ణకు గ్రేడ్ 4 పంచాయతీ కార్యదర్శి గా పి. సూర్య ప్రకాష్‌కు వెల్ఫేర్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ గా ఏపీఎస్ కే. ప్రణీత్ కు విలేజ్ అగ్రికల్చర్‌గా ఈ. శ్రీ తేజ్ కు వెల్ఫేర్ ఎడ్యుకేషనల్ అసిస్టెంట్‌గా సిహెచ్. హరితకు వెల్ఫేర్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్‌గా హాయ్ రజినీకి గ్రేట్ ఫోర్ పంచాయతీ సెక్రటరీగా పోస్టింగ్ ఇచ్చారు. శుక్రవారం కలెక్టరేట్ పరిపాలనాధికారి తుమ్మా విజయకుమార్ వీరికి నియామకు పత్రాలు అందజేశారు.